ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు

5

గురువారం 14 ఆగస్టు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 24.0

కుండపోత



పెదపాడులో వర్షం

- జిల్లాలో భారీవర్షాలు.. స్తంభించిన జనజీవనం
- అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్
- జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంపీ పుట్టా
- రాష్ట్ర హోం మంత్రి వీడియో కాన్ఫరెన్స్

ఏలూరుసిటీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. గత 24 గంటల్లో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 115.2 మిల్లీ మీటర్లు, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిడమర్రు మండలంలో అత్యధికంగా 95 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అల్పపీడన ద్రోణి గురువారం బలపడి వాయుగుండంగా మారే అవకాశాలున్నాయి. ఈ ప్రభావం వల్ల అతి భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. భారీ వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏలూరు నగరంతోపాటు చింతలపూడి, భీమడోలు, లింగపాలెం, కామవరపుకోట, దెందులూరు, కైకలూరు, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల, పెదవేగి, పెదపాడు తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ప్రస్తుత వర్షాలు సార్వాకు అనుకూలించగా, చలి కారణంగా రొయ్యలకు వైరస్ పెరిగిపోయే ప్రమాదం ఉంది.



ముదినేపల్లి మండలంలో నీట మునిగిన వరి పొలాలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



భారీ వర్షాలతో జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్, విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు పెట్టారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 1800 233 1077 టోల్ ఫ్రీ నంబర్‌తోపాటు 94910 41419తో ఏర్పాటు చేశారు. ఈ కంట్రోలు రూమ్‌ల్లో విద్యుత్, వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. 108 వాహనాల జాబితా, డ్రైవర్ల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోని ఆదేశించారు. తమ్మిలేరు, బుడమేరు, ఏలూరు కాలువ ఉధృతంగా ప్రవహించే అవకాశం దృష్ట్యా ఆకస్మిక వరదల సమాచారాన్ని కింద ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలి. కొల్లేరులోని ముంపు ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో కొండవాగులు పొంగి అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు దాటకుండా చూడాలన్నారు. మండల, డివిజన్ కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది 24 గంటలపాటు అందుబాటులో ఉండాలన్నారు. మరోవైపు భారీ వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టాలు కలుగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు తెలిపారు. భూపరిపాలనా శాఖ చీఫ్ కమిషనర్ జయలక్ష్మితో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు. మరోవైపు అధిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ సూచించారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వితో ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడారు. అత్యవసర సమయంలో ఏలూరు ఎంపీ కార్యాలయం ఫోన్ నంబర్లు 96181 94377, 98855 19299 లలో సంప్రదించాలని సూచించారు.

వర్షపాతం వివరాలు

బుధవారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి పదిన్నర గంటల వరకు నిడమర్రు మండ లంలో అత్యధికంగా 208 మిల్లీ మీటర్లు నమోదు కాగా జిల్లా సరాసరి వర్షపాతం 25.8 మి.మీ. ద్వారకా తిరుమల 68.2, ఉంగుటూరు 65.2, భీమడోలు 53.4, దెందులూరు 49.6, కామవరపుకోట 47.2, చాట్రాయి 42.2, పెదపాడు 36.4, పెదవేగి 34.6, ముసునూరు 33.8, ఏలూరు రూరల్ 28.2, ఏలూరు అర్బన్ 26.6, లింగపాలెం 18.6, మండవల్లి 16.4, చింతలపూడి 15.6, ఆగిరిపల్లి 14.8, నూజివీడు 12.6, ముదినేపల్లి 12.2, కైకలూరు 12.2, కలిదిండి 11.4, బుట్టాయిగూడెం 7, జంగారెడ్డిగూడెం 5, వేలేరుపాడు 4.8, టి.నరసాపురం 4.2, కొయ్యల గూడెం 4.2, పోలవరం 2, కుక్కునూరు 1.2, జీలుగుమిల్లి 0.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.



నిడమర్రులో కురుస్తున్న వర్షం

విద్యుత్‌శాఖ అప్రమత్తం : ఎస్ఈ సాల్మన్‌రాజు

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ఆ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు అప్రమత్తం చేశారు. ఏలూరు ఆర్ఆర్ పేట విద్యుత్ భవన్‌లో 94409 02926, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయంలో 94910 30712 నంబర్లతో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా విద్యుత్ అంతరాయం లేదా సమస్యలు ఏర్పడితే దగ్గరలోని విద్యుత్ సెక్షన్ (మిగతా 8వ పేజీలో)

జోరు వర్షాలతో రైతుల ఆనందం



ద్వారకాతిరుమల ఆలయ ప్రాంతంలో నిలిచిన వర్షం నీరు

చింతలపూడి/పెదపాడు/ద్వారకా తిరుమల/ లింగపాలెం, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా చింతలపూడి పరిసర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి జోరువర్షం కురిసింది. పెదపాడులో అంతర్గత రహదారుల వెంబడి డ్రెయిన్లు పొంగి పొర్లి మురుగు నీరుతో కలిసి వర్షం నీరు రోడ్లపైకి చేరింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు, రైతులు, రైతు కూలీలు తడిసి ముద్దయ్యారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు విద్యుత్తును నిలుపుదల చేశారు. ద్వారకా తిరుమలలో ప్రజలు, భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మెట్ల దారివెంట భారీగా వర్షపు నీరు ప్రవహించింది. గ్రామంలో లోతట్టు ప్రదేశాలు వర్షపునీటితో నిండిపోయాయి. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహించింది. గుడి సెంటర్ వర్ష తీవ్రతతో నిర్మానుష్యంగా మారింది. కాగా వర్షాలు సంవృద్ధిగా పడాల్సిన సమయంలో వేసవిని తలపించేలా ఎండలు మండిపోయాయి. ఎప్పుడెప్పుడు పడుతుందా అని ఎదురుచూస్తున్న రైతులకు నిన్నటి నుంచి పడుతున్న వర్షం వారి కళ్లల్లో ఆనందం నింపింది. మెట్ట ప్రాంతాల్లోని అన్నదాతలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపశమనం కలిగించాయి. అధిక ఉష్ణోగ్రత లతో పాటు వర్షాభావ పరిస్థితులతో ఆలస్యమైన వరినాట్లు పూర్తి చేసేందుకు రైతులు పొలంబాట పట్టారు. ఈ వర్షాలకు భూగర్భజలాలు పెరిగి పొలాల్లోని బోర్లలో నీరుపెరిగే అవకాశముందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కామినేని

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- కైకలూరు ఎమ్మెల్యే కామినేని
- 'అన్నదాత సుఖీభవ' కృతజ్ఞతా ర్యాలీ

కైకలూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి చేకూరడంతో బుధవారం రైతులు ట్రాక్టర్ల ర్యాలీ చేసి కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నుంచి 300 ట్రాక్టర్లతో ర్యాలీగా మార్కెట్ యార్డ్ వరకు వెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఆర్థికంగా రాష్ట్రంలో విధ్వంసం జరిగినా సూపర్-6 పథకాలు అమలులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు లబ్ధి చేకూర్చాలని అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కోకన్వీనర్లు బలే ఏసురాజు, కొడాలి వినోద్, బీకేఎం నాని, కూటమి పార్టీల మండల పార్టీల అధ్యక్షులు, రైతు సంఘాల నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గనులశాఖ డీడీగా పాపారావు బాధ్యతలు

ఏలూరు,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా భూగర్భ, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా జి.పాపారావు ఏలూరు ఎన్ఆర్‌పేటలోని కార్యాలయంలో బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్, ఇతర సిబ్బంది బొకేలు ఇచ్చి పరిచయం చేసుకున్నారు. ఈయన ఏపీ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో డీడీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. జూన్ నెలాఖరున ఏలూరు డీడీ రవికుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో, ఇన్‌చార్జిగా విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న కిశోర్ బాపూజీ డీడీగా వ్యవహరిస్తూ వచ్చారు. రాబోయే కాలంలో గనులశాఖ ద్వారా పలు పథకాలు, లీజులు పర్యవేక్షించాల్సిన ఉన్నందున డీడీ నియామకం చేపట్టినట్టు చెబుతున్నారు.

మాతా,శిశు మరణాలపై విచారణకు కలెక్టర్ ఆదేశాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలంలో మూడు మాతా మరణాలు, 54 శిశు మరణాలు సంభవించడంపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని వైద్యాధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా మాతా, శిశుమరణాల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రివెంటబుల్ మరణాలు సంభవించిన సందర్భాల్లో సీనియర్ వైద్యాధికారులతో విచారణ, కేస్ స్టడీ చేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతంను కోరారు. డీసీహెచ్ఎస్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్, ఐసీడీఎస్ పీడీ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

■ లోపలి పేజీలో..

ఇంకెప్పుడు!



ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తైన నేపథ్యంలో 'తొలి అడుగు' అన్ని నియోజక వర్గాల్లో నిర్విరామంగా నిర్వహించింది. నామినేటెడ్ పదవుల కోసం వేచిఉన్న సీనియర్లతో పాటు, జూనియర్లు ఎప్పటికప్పుడు పరిగణనలోకి తీసుకోవాలన్న డిమాండ్ ఉంది. కాని కొన్నిచోట సీనియర్లకు ఇప్పటికే మొండిచెయ్యే. ఒకవైపు జిల్లాలో కూటమి పక్షాలకు కాస్తో,కూస్తో నామినేటెడ్ పదవుల్లో చోటిచ్చేందుకు ప్రయత్నించారు. ఇప్పటివరకు అత్యంత కీలకమైన కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను భర్తీ చేశారు. ఇంకా మిగిలిన వాటికి కసరత్తు జరుగుతోంది.

- త్యాగాల కోర్చిన వారందరికీ ప్రాధాన్యత
- ముద్దరబోయిన లాంటి సీనియర్లకు తప్ప..
- వడ్డీ కార్పొరేషన్ ఘంటసాల లక్ష్మికే..
- జనసేనలో అందరికి సముచిత ప్రాధాన్యం
- ఇంకా ప్రకటించాల్సిన కార్పొరేషన్లు ఎన్నో
- వీటి కోసం ఇప్పట్నుంచే ఎదురుచూపులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నామినేటెడ్ పదవుల కోసం కూటమి పక్షాల్లో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆశించారు. టీడీపీ అధికారంలోకి రాగానే తాము ఏమీ ఆశిస్తుందనదీ వినతుల రూపంలో పార్టీ దృష్టికి తీసుకెళ్లారు.సీనియర్లను కలిసి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దఫాలుగా వారీగా నామిటేడెడ్ పోస్టుల భర్తీ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మూడు విడతలుగా వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు డైరెక్టర్లను నియమించారు. కొంతలో కొంత కూటమిలో ఉన్న అంతర్గత అసంతృప్తిని తగ్గించగలిగారు. పోలవరం నియోజకవర్గం నుంచి జనసేన పక్షాన ఎమ్మెల్యేగా చిర్రి బాలరాజు గెలుపొందారు.టీడీపీ పక్షాన పోటీ చేయాలని భావించిన చివరికి అవకాశం దక్కని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌ను ట్రైకార్ చైర్మన్‌గా నియమించి సర్దుబాటు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యేగా ధర్మరాజు గెలుపొందగా, ప్రస్తుత టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు భీమడోలు సహకార సంఘం అధ్యక్షుడిగా, ఉమ్మడి పశ్చిమ గోదావరి డీసీసీబీ చైర్మన్‌గా, రాష్ట్రస్థాయిలో ఆప్కాబ్ చైర్మన్‌గా ప్రభుత్వం నామినేటెడ్ చేసింది. చాన్నాళ్లు ఓపికగా ఉన్నందుకు గన్నికి ఈ అర్హత దక్కింది. కైకలూరు నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే గెలిచినప్పటికి ఈ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాల్లో సీనియర్లలో ఒకరికి ఏదైనా కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవి దక్కుతుందని ఆశించారు. కాని తాజా జాబితాలో కూడా కైకలూరుకు అవకాశం చిక్కలేదు. ఈ నియోజకవర్గంలో సీనియర్ నేత కమ్మిలి విఠల్‌తో పాటు మరికొందరు ఉన్నా ఆ వైపు ఇంకా దృష్టి పెట్టలేదు. ఏలూరు సీటును ఆది నుంచి ఆశించిన జనసేన నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి అప్పల నాయుడుకు విజయవాడ ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) రీజనల్ చైర్మన్‌గా నియమించారు. అయితే అప్పల నాయుడు ఆశించింది వేరు. కనీసం ప్రాధాన్యం కలిగిన, ప్రజలకు దగ్గరయ్యే అవకాశం కార్పొరేషన్ తమ నేతకు ఇచ్చి ఉండాల్సిందన్న అభిప్రాయం ఆయన కేడర్‌లో ఇప్పటికీ ఉంది. అయినప్పటికి అప్పలనాయుడు ఉన్నంతలోనే సర్దుకుపోతున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, సీనియర్ నేత జగ్గవరపు ముత్తారెడ్డి వంటి నేతలంతా రాష్ట్రస్థాయిలో తమకు ప్రాధాన్యత కలిగిన కార్పొరేషన్లలో (మిగతా 8వ పేజీలో)

ముద్దరబోయినకు ఏమిస్తారు ?



పార్టీలో సుదీర్ఘకాలం పాటు నూజివీడు నియోజకవర్గంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పార్టీ కార్యక్రమాలను నిర్వహించారు. అంతా తానై నడిపించారు. బీసీ వర్గానికి చెందిన ప్రతినిధిగా గుర్తింపు పొందారు. నూజివీడు నుంచి పోటీ చేయాలని భావించినా చివరి క్షణంలో నూజివీడు నుంచి ప్రస్తుత మంత్రి కొలుసు పార్థసారథి పోటీకి దిగారు. టీడీపీ నాయకత్వం సైతం సారథి వైపు మొగ్గు చూపింది. మరోవైపు ముద్దర బోయినకు ప్రాధాన్యత కలిగిన పదవి ఇస్తామంటూ భరోసా ఇచ్చింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు నామినేటెడ్ పోస్టులో తనకు మంచి అవకాశం ఇస్తారని ఆయన ఎదురుచూస్తూ వచ్చారు. ఆయన కేడర్ కూడా ఇదే డిమాండ్‌తో ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన కొన్ని కీలక కార్పొరేషన్ లోను అవకాశం రాలేదు. తమ నాయకుడిని విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్‌గా నియమిస్తారని ప్రచారం జరిగిన విషయాన్ని ఇప్పటికీ కేడర్ గుర్తు చేస్తూనే ఉంది. ముద్దరబోయిన పార్టీ నిర్ణయం తనకు అనుకూలంగా ఉంటుందన్న విశ్వాసంతో ఉన్నారు. తాజాగా ప్రకటించిన కార్పొరేషన్లలో సగానికి పైగా బీసీలనే నామినేటెడ్ చేయడాన్ని ఇంకొందరు ప్రస్తావిస్తున్నారు.

కైకలూరు నియోజకవర్గాన్ని..
కృష్ణాలో విలీనం చేయండి



- ఎమ్మెల్యే కామినేనికి వినతి
- మంత్రి అనగానికి రాతపూర్వక లేఖ

కైకలూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించడంతో కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో విలీనం చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున డిమాండ్ వినిపిస్తోంది. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా జిల్లాల విభజన ఇష్టానుసారంగా చేయడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అప్పటి నాయకులు దీనిపైన ఎలాంటి ఆలోచనలు చేయక పోవడం రానున్న రోజుల్లో కైకలూరు నియోజకవర్గానికి ఎదురయ్యే కష్టనష్టాలను బేరీజు చేయకుండా వదిలివేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరలా జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టడంతో కైకలూరు నియోజకవర్గంలోని ప్రజలు డిమాండ్ తెరపైకి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు ఉన్నాయి. వీటిలో ముదినేపల్లి మండలం గుడివాడ అత్యంత సమీపంగా ఉండడంతో ఆ మండలంలోని ప్రజలు, రైతులు ముందు నుంచి కృష్ణాలో విలీనం చేయాలనే వాదన బలంగా వినిపిస్తూ వచ్చారు. ప్రస్తుతం మరోసారి ముదినేపల్లి మండలంతో పాటు నియోజక వర్గంలోని మిగిలిన మూడు మండలాల ప్రజలు కృష్ణాలో విలీనం చేయాలనే డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల పునర్విభజన కమిటీ సభ్యుడిగా ఉన్న మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇవ్వడమే కాకుండా రాతపూర్వకంగా లేఖను పంపించారు. ఎమ్మెల్యే సిఫార్సు ఉండడం, ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఖచ్చితంగా కైకలూరు నియోజక వర్గాన్ని కృష్ణాలో విలీనం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎదురవుతున్న సమస్యలు...

- కైకలూరు శివారు ప్రాంతం కావడం, నీటి వనరులంతా కృష్ణా జిల్లాలో ఉండగా వైసీపీ ప్రభుత్వం కైకలూరు నియోజకవర్గాన్ని ఏలూరులో విలీనం చేయడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో నీటి ఇబ్బందులు వస్తే తాగేందుకు నీరు అందని పరిస్థితులు నెలకొంటాయని ఇప్పటికే నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణా నది నుంచి కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని అన్ని కాల్వలకు నీరు రావాల్సి ఉంది. నీటి సరఫరాలో రెండు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే కైకలూరు శివారు ప్రాంతాలకు తాగు, సాగునీరు అందుతుందని అధికారులు మధ్య సమన్వయలోపం ఏర్పడితే నీటి ఇబ్బందులు తప్పనిసరిగా ఎదుర్కోవాల్సి వస్తోంది.
- ప్రభుత్వ పాలనాపరంగా అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. కైకలూరు నియోజకవర్గానికి వివిధ శాఖల్లో పనిచేసే అధికారులు సైతం రావడానికి సుముఖత చూపడం లేదు. కైకలూరు ఏలూరు జిల్లాలో ఉండడంతో రానున్న రోజుల్లో బదిలీల ప్రక్రియలో ఈ జిల్లాలోనే ఉండాల్సి వస్తే కృష్ణా జిల్లాలో ఉన్న వారి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని కైకలూరు వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న పరిపాలనా విభాగం అంతా కృష్ణాజిల్లా నుంచి నడవడంతో ఇరు జిల్లాల ఉన్నతాధికారులు కలిసి పనిచేస్తేనే పనులు జరుగుతున్నాయి. ఒక అధికారిపై చర్యలు తీసుకోవాలన్నా లేకుంటే బదిలీ చేయాలన్నా ఇరుజిల్లాల అధికారులు కలిసి పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో మండలస్థాయి అధికారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అధికారులు సైతం కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ప్రజల నుంచి ఈ డిమాండ్ కమిటీ దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

20వ తేదీ వరకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు గడువు

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ విద్యాహక్కు చట్టం 12(1)సీ నిబంధన మేరకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను నిర్ధీత వర్గాల కుటుంబాల పిల్లలకు మూడో విడత ప్రవేశాల కింద ఉచిత అడ్మిషన్లు ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ తెలిపారు. అర్హులైన కుటుంబాల పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పేందుకు సీఎస్ఈ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, లాటరీ ద్వారా ఎంపికల ఫలితాలను 25న ప్రకటిస్తారని, అడ్మిషన్ ఖరారైన పాఠశాలల నిర్ధారణ ఈ నెల 31న జరుగుతుందన్నారు. వివరాల కోసం హెల్ప్‌డెస్క్ టోల్‌ఫ్రీ నంబరు 1800-4258-599లో ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల్లోగా కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలని కోరారు.

మాదక ద్రవ్యాలను అరికట్టడం అందరి బాధ్యత : కలెక్టర్

ఏలూరు,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాలను నియంత్రణ, వాటిని అరికట్టడంలో సమాజంలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. 'నషా ముక్తి భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నగరంలోని సర్ సీఆర్ రెడ్డి కళాశాల గ్రౌండ్స్‌లో జిల్లా యంత్రాంగం, ఎక్సైజ్, ఈగల్ టీమ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని విద్యార్థులతో కలిసి చేశారు. డ్రగ్స్ వద్దు బ్రో, సే నో టు డ్రగ్స్ అనే నినాదాలతో కూడిన లోగోలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణను అరికట్టేందుకు రెండేళ్ల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ఒక వ్యక్తి అలవాటు పడటం వల్ల ఆ కుటుంబానికి, సమాజానికి చేటు తెస్తుందన్నారు. ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండురంగారావు,ఈగల్ టీమ్ ఎస్ఐ ఉదయ్‌భాస్కర్, ఇతర అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నియంత్రణ లోగోలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్, ఎమ్మెల్యే చంటి

కరువు తీరా వాన..

వాన ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న జనాలకు బుధవారం కుండపోతగా కురిసిన వర్షం కరువు తీర్చేసింది.. సాయంత్రం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయ మయ్యాయి.. ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఈ ప్రభావంతో భారీ వర్షాలు కురవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తోంది.




పెనుగొండ, తాడేపల్లిగూడెంలలో జోరు వాన..



ఆచంటలో..



కె.సావరం కోస్టల్ ఆగ్రోలో మిషనరీ వద్దకు చేరిన వర్షం నీరు.. తడిసిన పేపర్ రోల్స్



చెరువులా మారిన తాడేపల్లిగూడెం మెయిన్‌రోడ్డు



ద్వారకాతిరుమలలో శివాలయానికి వెళ్లే మెట్ల దారి నుంచి వర్షపునీరు జోరు



జలమయమైన గణపవరం- ఏలూరు రోడ్డు



భీమవరంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

యువతలో దేశభక్తిని చాటేందుకే..

జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువతలో స్వాతంత్ర్య స్ఫూర్తిని కలిగించేందుకు జాతీయ జెండాలతో సమైక్యతా ర్యాలీలను జరుపుతున్నారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. బుధవారం భీమవరంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. భీమవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు జరిగిన ఈ భారీ ర్యాలీని మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని చేతబట్టి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. దేశ సరిహద్దుల్లో దేశం కోసం కాపలా కాస్తున్న లక్షలాదిమంది సైనికులకు మేము మీకు అండగా ఉన్నామనే భరోసా కల్పించడం కోసం తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, సీనియర్ నాయకులు పేరిచర్ల సుభాష్ రాజు, నారిన తాతీజీ, అల్లూరి దుర్గరాజు, కలిదిండి వినోద్‌వర్మ, తోట గంగరాజు పాల్గొన్నారు.



గూడెంలో 468 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకే ఇంటింటా జాతీయ జెండా కార్యక్రమం చేపట్టినట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. తాడేపల్లిగూడెంలో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో జీఎంఆర్ కళాశాల నుంచి శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్ వరకు 468 మీటర్ల పొడవు ఉన్న త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎగుర వేసి దేశభక్తిని చాటాలని పిలుపు నిచ్చారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, కోట రాంబాబు, దువ్వా శ్రీనివాస్, నరిసే సోమేశ్వరరావు, కంచుమర్తి నాగేశ్వరరావు, చిట్యాల రాంబాబు, గట్టిం సింధు పాల్గొన్నారు.



ఎంజీఎం ట్రస్ట్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సభ్యులు

గాంధీజీ ఆశయాల బాటలో నడవాలి

కాళ్ళ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని సర్వోదయ మండలి జిల్లా కన్వీనర్ ప్రసాదరాజు తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గాంధీ స్మారక నిధి, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 'గాంధీజీ ఆశించిన సురాజ్యం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జూనియర్, సీనియర్, కళాశాల స్థాయి విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ బుధవారం నిర్వహించారు. పెద అమిరం ఎంజీఎం ట్రస్ట్ భవనంలో ట్రస్ట్ నిర్వాహకులు సాయిబాబా చేతుల మీదుగా అందజేశారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధురాలు సుభద్రాదేవి, పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్ రాజు చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాదరాజు మాట్లాడుతూ గాంధీజీ సత్యం, శాంతి, అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, గాంధీజీ ఆశించిన సురాజ్యం స్థాపనకు మనందరం కృషి చేయాలన్నారు. మానవత అధ్యక్షుడు రామకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్ఎన్ రాజు, మురళి, గోపాలశర్మ, చాన్‌బాషా, సీతారామరాజు, గోపాలరాజు, రాము,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా వైద్య ఉద్యోగులకు ముగ్గుల పోటీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు బుధవారం కార్యాలయ ప్రాంగణంలో రంగవల్లుల పోటీలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం మాట్లాడుతూ జాతీయ సమగ్రత ప్రధానాంశంగా ఉద్యోగినులు సందేశాత్మక ముగ్గులు వేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి పోటీలు ఉద్యోగులకు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగించడమేగాక దేశంపట్ల అంకితభావం ఏర్పడుతుందన్నారు. పోటీతత్వం, స్నేహభావం ఏర్పడతాయన్నారు. అనంతరం జరిగిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలైన గంజాయి, గుట్కా, ఖైనీ, బ్రౌన్‌సుగర్, హెరాయిన్ వంటివి విద్యార్థి, యువత జీవితాలను నిర్వీర్యం చేస్తాయని, వీటి అనర్థాల గురించి ఇంటింటా సర్వేలో విస్తృత అవగాహన కలిగించాలని సూచించారు. ముగ్గులపోటీ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యాలయ పరిపాలనాధికారి డాక్టర్ గంగాభవాని, డీఐవో డాక్టర్ శోభ, డీఎంవో డాక్టర్ ప్రసాద్, వైద్యాధికారులు నరేంద్రకృష్ణ, రోహిత్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో, తదితరులు

ఎక్కడికెళ్లినా అభయం

ఆసుపత్రుల్లో అభా ఐడీ కార్డుల నమోదు
రోగి ఆరోగ్య రికార్డు కంప్యూటర్‌లో నిక్షిప్తం
దేశంలో ఎక్కడైనా వైద్యసేవలు

తణుకు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రులలో డిజిటల్ వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ పథకంలో ఐడీ కార్డు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రిలలో అభా ఐడీ ద్వారా వైద్య సేవలు పొందుతున్నారు. ఐడీ క్రియేట్ చేసే సమయంలో ఫోన్, ఆధార్ నంబర్ వంటి వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. ఐడీలో రోగి పేరు, వయసు, మందులు, టెస్టులు వంటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల ఎలాంటి టెస్టు రిపోర్టులు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు.

నేరుగా వైద్యుని వద్దకు

ప్రస్తుత పరిస్థితులకు, గత పరిస్థితులకు ఎంతో వ్యత్యాసం ఉంది. గతంలో ఆసుపత్రిలో ఓపీ కౌంటర్ వద్ద చాలా సమయం వేచి ఉండాల్సి వచ్చేది. చీటి రాసిన తర్వాత వైద్యులు చూడటానికి మరింత సమయం పట్టేది. ప్రస్తుతం ఐడీ కార్డుతో నేరుగా వైద్యుని వద్దకు వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల సమయంతో పాటు వైద్యం కూడా సులువుగా అందుతుంది. డాక్టర్లు వెంటనే చూడటం వల్ల ఏదైనా పరీక్షలు అవసరం అయితే వెంనే చేయించుకునే అవకాశం ఉంటుంది.

పశ్చిమలో 132 ఆసుపత్రులు

జిల్లా వ్యాప్తంగా 132 ఆసుపత్రుల ద్వారా ప్రతి ఓపీ ద్వారా 48 వేల మంది రోగులు వివిధ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు-18, పీహెచ్‌సీలు-34. ఏరియా ఆసుపత్రిలు-4, సీహెచ్‌సీలు-3, జిల్లా ఆసుపత్రి-1 ఉన్నాయి. ఆయా ఆసుపత్రిల ద్వారా ప్రతి రోజు వేలాదిగా సేవలు పొందుతున్నారు. ఇప్పటికే ఆసుపత్రులకు వచ్చేవారికి అభ ఐడీ ఇచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ఈహెచ్‌ఆర్ అంటే ..

ఈహెచ్‌ఆర్ అంటే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు. రోగికి సంబంధించిన మొత్తం వైద్య సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. రోగికి సంబంధించిన ప్రస్తుత, గత రోగాలకు సంబం ధించిన చరిత్ర, వైద్యులు నోట్‌లు, పలు రకాలు టెస్టు రిపోర్టులు, ల్యాబ్, ఎక్స్‌రే, స్కాన్, ఈసీజీ వంటివి ఉంటాయి. మందులు వివరాలు, అలర్జీలు, టీకాలుకు సంబంధించి అన్ని రకాలు వివరాలు పొందుపరుస్తారు. ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డు ద్వారా ఏ ప్రాంతంలో అయినా ఐడీతో వైద్యం పొందవచ్చు.

దేశంలో ఎక్కడైనా వైద్యం

ఐడీ కార్డు ఉన్న వారు ఎక్కడ ఉంటే అక్కడ వైద్యం చేయించు కునే అవకాశం కల్పించారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఏ ప్రాంతంలో అయినా సరే వైద్యసేవలు పొందవచ్చు. రోగికి సంబందించిన ఆరోగ్య రికార్డు సిస్టమ్‌లో పొందుపర్చడం ద్వారా అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం అవకాశం కల్పించారు. త్వరలోనే ప్రైవేటు ఆసుపత్రిలకు కూడా లాగిన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.



97 శాతం మందికి ఐడీలు

తమ పరిధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లు, పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకు అధిక శాతం సుమారుగా 97 శాతం వరకు అభ ఐడీ కార్డులు అందించాం. ఆసుపత్రిలకి వచ్చిన వారికి అందరికి ఐడీ కార్డు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాం. దీనిని ఉపయోగించుకోవాలి.

- గీతాబాయి, పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

ఆసుపత్రిలలో ప్రతిచోట ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశాం. ఐడీలు క్రియేట్ చేసినపుడు మాత్రం కొద్దిగా సమయం పడుతుంది. కాస్త ఆలస్యం అయినా ఐడీ క్రియేట్ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు ఉండవు. కేవలం కార్డుతో వైద్యం పొందవచ్చు.

- పి.సూర్యనారాయణ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయాధికారి

ఆగస్టు 15న అధికారులు, సిబ్బందికి పురస్కారాలు : ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సమాజానికి ఆదర్శంగా నిలిచే విధంగా కృషి చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. 2025 ఉగాది ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికైన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరంతా ఆగస్టు 15న ఏలూరులో పురస్కారాకలు అందుకోనున్నట్టు ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో చూపించిన అంకిత భావం, క్రమశిక్షణ, ప్రజల భద్రత కోసం చేసిన కృషిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఈ పురస్కారాలు ప్రదానం చేసిందన్నారు. ఏలూరు జిల్లా నుంచి ఉత్తమ సేవా పతకం అందుకున్న ఏలూరు డీసీఆర్బీలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగులు అందుకున్నారు. నిడమర్రు సీఐ మాగంటి వెంకట సుభాష్ (ప్రస్తుతం జంగారెడ్డిగూడెం సీఐ), ఏలూరు ఆర్ఐ భవన్‌కుమార్, నూజివీడు రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, దెందులూరు హెడ్‌కానిస్టేబుల్ నందిగం వెంకట రంగా సత్యనారాయణ, మహిళా పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు, ఏలూరు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, ఏలూరు ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ చిట్టిబాబు, చింతలపూడి కానిస్టేబుల్ సురేష్, నర్సాపురం కానిస్టేబుల్ ఆడమిల్లి నాగబాబులు సేవా పతకాలు అందుకున్నారు.

ఆదర్శం..ఈ సార్..

వినూత్న బోధనా విధానాలతో ఆకట్టుకుంటున్న సుబ్బారావు మాస్టారు



వినూత్నంగా తయారు చేసిన బోధనా వస్తువులతో..



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగడంతో పాటు అనుకున్నది సాధించాడు. ఉపాధ్యాయుడిగా కొలువు వచ్చాక ఏదో ఉద్యోగం చేద్దాంలే అనుకోకుండా పేద విద్యార్థులకు మెరుగైన చదువులు అందించి ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం ప్రాథమిక పాఠశాల (ఏఏ-2)లో టీచర్‌గా చేస్తున్న సుబ్బారావు ఆనాడు తనకు అందని కార్పొరేట్ స్థాయి విద్యను తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు అందించాల నుకున్నారు. మెరుగైన విద్యనందించడంతో పాటు విద్యార్థులకు వినూత్న కార్యక్రమాలు అలవాటు చేస్తూ పాఠశాలను ఆదర్శంగా నిలుపుతున్నారు. మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

వినూత్న కార్యక్రమాలు ఇలా..

పాఠశాలలో విద్యావాణి, ఉపాధ్యాయ నేస్తం పుస్తకం రాయడంతో పాటు, బాలల సృజన, మనబడి పిల్లల పత్రిక నిర్వహణ, బాల సైనిక దళం ఏర్పాటు చేసి విద్యార్థులలో సేవా గుణం అలవర్చడం, క్రమశిక్షణ నేర్పుతున్నారు. వాటితో పాటు పిల్లలకు భవిష్యత్‌పై ఆశ కల్పించేందుకు చిన్నారి డాక్టర్ల టీం ఏర్పాటు చేశారు. ఏ ప్రైడ్ ఆఫ్ స్టూడెంట్, బడికి వందనం, తల్లి రుణం తీర్చుకుందాం, ఉపాధ్యాయ సృజన, తదితర వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ఇటు తోటి ఉపాధ్యాయుల నుంచే కాకుండా విద్యాశాఖ అధికారుల మన్ననలు పొందుతున్నారు. కరోనా సమయంలో విద్యార్థులు ఇళ్లకే పరిమితమైన సమయంలో విద్యార్థులు చదువులో వెనకబడకూడదనే సంకల్పంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందకముందే ఆన్‌లైన్ ద్వారా సిలబస్ పూర్తిచేశారు. చిన్న వయసులోనే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నుంచి విద్యారత్నం, ఉపాధ్యాయ రత్న, ఆచార్య దేవో భవ, విద్యాజ్యోతి, సేవామిత్ర, విద్యాభూషన్, గురుబ్రహ్మ, ఉద్యోగ సత్కారం, సేవా జ్యోతి, తదితర అవార్డులు అందుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

తాను చేసే పాఠశాలలో దాతలను భాగస్వాములు చేసి పాఠశాల గ్రౌండ్ అభివృద్ధి చేశారు. పాఠశాల ఆటస్థలానికి 25 లక్షల విలువ చేసే 60 సెంట్ల స్థలాన్ని దాతల ద్వారా సేకరించారు. విద్యార్థులకు ఆట వస్తువులు తదితర సామాగ్రి సమకూర్చారు. ఆసియా పసిఫిక్ వేదిక్ కల్చర్ ఫౌండేషన్ బెంగళూరు వారు పాఠశాల విద్యలో సమాజాన్ని భాగస్వామ్యం చేసిన అంశంలో డాక్టరేట్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారంతా సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారే ఉంటారని వారికి నాణ్యమైన విద్య, క్రమశిక్షణ అందించాలనే సంకల్పంతోనే ఉపాధ్యాయ వృత్తిలో పని చేస్తున్నట్టు సుబ్బారావు చెప్పారు.



బాల సైనిక దళంతో విద్యాశాఖ అధికారులు (ఫైల్)


స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పదవి భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అర్ధంతర తొలగింపుతో ప్రస్తుత కార్యదర్శులకే మరో ఛాన్స్ ఇవ్వాలని పీఈటీల నిర్ణయం ?

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-14,17) సెక్రటరీ పోస్టు భర్తీకి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. రెండేళ్ల (2025-27) పదవీ కాలానికి గాను భర్తీకి అభ్యర్థుల సీనియార్టీని ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. కనీసం పదేళ్ల సర్వీసు వున్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ /పీఈటీలు ఈ నెల 20వ తేదీ లోగా సంబంధిత స్కూలు హెచ్ఎం సిఫారసుతో ఏలూరు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

తెరవెనుక కథ ఇదేనా ?!

స్కూల్‌గేమ్స్ కార్యదర్శి పదవి రెండేళ్లు కాగా ప్రస్తుతం ఆ పోస్టులో పనిచేస్తున్నవారిని ఏడాదికాలానికే తొలగించడంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్రంలో కొందరు కార్యదర్శులు కోర్టును ఆశ్రయించగా స్టే ఉత్తర్వులు ఇచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలోనే కార్యదర్శి పదవికి ఇపుడున్న అర్హతలను సవరిస్తూ కొత్తగా అన్ని జిల్లాల్లో ఈ పోస్టుల భర్తీకి తీసుకున్న నిర్ణయంలో భాగంగానే ఈ నియామకాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కార్యదర్శి పదవుల్లో వున్నవారిని రెండేళ్ల కాలపరిమితి పూర్తికాకుండానే తొలగించడంతో జిల్లాలోని వ్యాయామోపాధ్యాయులందరూ సమావేశమై ప్రస్తుతంలో ఆ పదవిలో వున్నవారికే సంఘీభావం ప్రకటిస్తూ మళ్లీ కార్యదర్శి పోస్టు లభించేలా పీఈటీ /పీడీలెవరూ దరఖాస్తు చేయరాదని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు సమాచారం. కాగా ఇదేక్రమంలో ఇంటర్మీడియట్ విద్య స్కూల్‌గేమ్స్ అండర్-19 విభాగం కార్యదర్శి పదవుల్లో వున్న వారిని కూడా తొలగించి, కొత్తగా నియామకాలకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది.



కబడ్డీ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్, ఆగస్టు 13, (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు క్రీడా ఎంపిక పోటీలు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం కబడ్డీ పోటీలకు ఎంపికలు జరిగాయి. చింతలపూడి నియోజకవర్గంలోని రాఘవాపురం ఆదర్శ స్కూల్ విద్యార్థులు చెన్ను మణికంఠసాయి, పజ్జూరి నాగసాయి గణేష్ ప్రతిభ కనబరిచి కాకినాడలో ఈనెల 28న జరిగే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెంకటేశ్వరరావు తెలిపారు. క్రీడాకారులకు పాఠశాల ప్రిన్సిపాల్ బొంతు లక్ష్మీ, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ రంగారావు, అధ్యక్షుడు శ్రీనివాసరావులు అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

సీఎంకు ఎమ్మెల్యే ఆరిమిల్లి వినతి



తణుకు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం సచివాలయంలోని సీఎం చంద్రబాబు నాయుడును ఆయన చాంబర్‌లో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. వివిధ అభివృద్ధి పనులు గురించి చర్చించినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన వలవల



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి బుధవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని లోకేశ్‌ను కోరారు.

16న ఎంపీ, సీపీఎం ఫ్లోర్ లీడర్ జాన్ బిట్రాస్ పర్యటన

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ ఎంపీ, సీపీఎం ఫ్లోర్ లీడర్ జాన్ బిట్రాస్ ఈనెల 16వ తేదీన ఏలూరు జిల్లాలోని పోలవరం నిర్వాసిత కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తారని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల్లో సమస్యలు, ఎల్‌టిఆర్ భూ సమస్యలను తెలుసుకుంటారన్నారు. 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరం చేరుకుని అక్కడ ఆర్‌అండ్‌ఆర్ భూముల పరిశీలన, అనంతరం రెడ్డి గణపవరం సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. సీపీఎం రాష్ట్ర నాయకులు బి.తులసీదాస్, బి.బలరాం తదితరులు ఉంటారని రవి తెలిపారు.

నర్సింగ్ చేసిన వారికి విదేశాల్లో ఉద్యోగాలు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి



ఏలూరు టూటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తిచేసిన వారికి జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఎస్సీ కార్పొ రేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ముక్కంటి తెలిపారు. నర్సింగ్ చదువుకుని 35 సంవత్సరాలోపు మహిళల నుంచి దరఖాస్తులు కోరుతు న్నామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. శిక్షణ 8 నుంచి 10 నెలల వరకు ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన వసతిసౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, కులధ్రువీకరణ, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వీ.గోపాల్ 93468 90335, కే.రామచందు 96665 45975 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీఎం వీబీఆర్‌వై పథకం ద్వారా ఉద్యోగికి అదనపు వేతనం.. యజమానికి ఆర్థిక ప్రోత్సాహం

ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు



రాజమహేంద్రవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన(పీఎంవీబీఆర్‌వై)' ద్వారా ఉద్యోగికి అదనపు వేతనంతో పాటు యజమానికి ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. క్రెడాయ్ ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. తొలిసారిగా ఉద్యోగం పొందిన వ్యక్తి ఖాతాలో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని (బేసిక్+డీఏ) కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో జమ చేస్తుందన్నారు.అలా మొత్తం గరిష్ఠంగా రూ.15 వేలు పొందవచ్చన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపాదికన ఉద్యోగం కల్పించిన యజమానికి నెలకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకూ రెండేళ్ల పాటు ఇస్తారన్నారు. ఉద్యోగికి డీబీటీ విధానంలో, యజమానికి పాన్ అనుసంధాన ఖాతాల ద్వారా ఈ ప్రోత్సాహకాలు జమ అవుతాయన్నారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకూ కల్పించిన ఉద్యోగాలకు పథకం వర్తిస్తుందన్నారు. రాజమండ్రి ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయ పరిధిలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 12 వేల కంపెనీలు నమోదై ఉన్నాయని, అవన్నీ తప్పనిసరిగా ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈపీఎఫ్‌వోలో సభ్యత్వం తీసుకొని కనీసం ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసిన వారికి ప్రమాద బీమా రూ.2.50 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల సంఘాలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్లు, ఆక్వా, చేనేత కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించామన్నారు. సహాయ పీఎఫ్ కమిషనర్లు శ్రీనివాసరావు, రాధానాథ్ పట్నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న జగన్

మాజీ ఎమ్మెల్యే పువ్వాల కుమార్తె వివాహానికి హాజరైన జగన్

భీమవరం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని వీవీఎస్ గార్డెన్స్‌లో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పువ్వాల వాసుబాబు కుమార్తె వివాహానికి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. తాడేపల్లి నుంచి హెలీ కాప్టర్‌లో భీమవరం చేరుకున్నారు. కల్యాణ మండపానికి చేరుకుని దాదాపు 20 నిమిషాల పాటు అక్కడ ఉన్నారు. వర్షం కారణంగా బందోబస్తుకు కొంత ఇబ్బంది కలిగింది. అనంతరం తిరిగి హెలీప్యాడ్‌కు చేరుకుని తాడేపల్లికి బయలు దేరి వెళ్లారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మాజీ మంత్రులు తానేటి వనిత, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, చినమిల్లి వెంకట్రాయుడు తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో 3.5 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తెస్తాం

» రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం పీడీ రాథోడ్



బయోఇన్పుట్స్ తయారీపై శిక్షణ పొందుతున్న బయోరిసోర్స్ కేంద్ర యజమానులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 3.5 లక్షల మంది రైతులను పకృతి వ్యవసాయంలోకి తీసుకుని రావడమే ఈ ఏడాది తమ లక్ష్యమని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం పీడీ రాథోడ్ ప్రవీణ్ వెల్లడించారు. గుండుగొలనుకుంట గ్రామంలో బయో రిసోర్స్ సెంటర్ యూనిట్‌లో ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 50 మంది బయో రిసోర్స్ కేంద్ర యజమానులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత క్షేత్రసందర్శన చేశారు. ఇందులో ఏటీఎం అనే 20 సెంట్ల నమూనాను చూపించగా ఏడాది పొడవునా వ్యవసాయం ద్వారా ఆదాయం పొందగలిగే విధానాలను, అంతరపంటలు, పీఎండీఎస్, 365 రోజుల గ్రీన్‌కవర్ (బయోమాస్ ద్వారా మట్టిని ఆరోగ్యంగా ఉంచడం) వంటి నమూనాలను ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణాన్ని పెంచే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మరిన్ని బయోరిసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అందులో రాష్ట్రస్థాయి నిపుణులైన రిసోర్స్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని వారి ద్వారా బయోరిసోర్స్ కేంద్ర యజమానులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగంలో శిక్షణ లభిస్తుం దన్నారు. శిక్షణలో ఘన, ద్రవ జీవా మృతాలు, నీమాస్త్రం వంటి జీవ ఉత్ప్రే రకాల తయారీ, వాడకంపై నిపు ణులు శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం ఔషధ మొక్కల ప్రయోజనాలు, వాటి జీవ ఉత్ప్రేరకాల తయారీ వినియోగం, మానవ వైద్యంలో ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏలూరు ప్రకృతి వ్యవసాయ డీపీఎం వెంకటేష్, బయోరిసోర్స్ సెంటర్ యజ మానులు, డీపీఎంయూ నుంచి జతిన్, ఎస్పీఎంయూ సభ్యులు పాల్గొన్నారు.



లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతు సంఘాల నాయకులు

బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వాలి

ఏలూరు రూరల్/ ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కౌలు గుర్తింపు ఉన్న రైతులకు పంట రుణాలు బ్యాంకులో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రికి ఏపీ కౌలు రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు కోఆరు. బుధవారం ఈ మేరకు ఏలూరులో వినతి పత్రం సమర్పించారు. ఏపీ కౌలు రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ నాయకత్వంలో సంఘ నాయకులు ప్రజా సంఘాల నాయకులు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌ని కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఉండి, వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ ఇతర రుణాలు మంజూరు చేయాలని కోరారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇచ్చేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. టిక్కలపాటి ప్రసాదరావు తదితరులు ఉన్నారు.



ఏలూరులో మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

'వ్యవసాయ రంగానికి తీరని నష్టం'

» రైతు, కార్మిక సంఘాల నాయకుల నిరసన

ఏలూరుకార్పొరేషన్,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛ, వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చ కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఏలూరులో క్విట్ కార్పొరేట్స్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతులు, కార్మికులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికులు నిరసన చేపట్టారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు కూలీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ మోదీ, ట్రంప్ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించారు. ఈ ఒప్పందాల వల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూరుతాయన్నారు. ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని మోదీ, ట్రంప్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కట్టా భాస్కరరావు, కోన శ్రీనివాసరావు, ముప్పిడి రాజరత్నం, పువ్వాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాసడాంగే, డి.ఎన్.వి.డి.ప్రసాద్, పళ్ళెం కిషోర్, జగన్నాధరావు, శ్యామలరావు పాల్గొన్నారు.

సీఆర్ రెడ్డి ఫార్మసీ కాలేజీకి 'అటానమస్ స్టేటస్'

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యారంగంలో గత 17 ఏళ్లుగా పాటించిన విద్యా ప్రమాణాలు, పరిశోధనల్లో సాధించిన ప్రగతికి గుర్తింపుగా ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు స్వయం ప్రతిపత్తి(అటానమస్ స్టేటస్)ను యూజీసీ ప్రకటించిందని కళా శాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నరేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు కళాశాలకు అటానమస్ హోదాను పదేళ్ల కాలానికి మంజూరుచేస్తూ యూజీసీ పంపిన అధికారిక సమాచారం వివరాలను స్థానిక విలేకరులకు బుధవారం తెలిపారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకు 20 బ్యాచ్‌లు బయటకువెళ్లాయని, తాజాగా లభించిన అటాన మస్ స్టేటస్‌వల్ల ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పీసీఐ) సిలబస్‌తోపాటే, అదనంగా ప్రస్తుత మార్కెట్‌కు అనువైన ఇండస్ట్రీ ఓరియెంటెడ్ పాఠ్యప్రణాళికలను నేరుగా కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే నాక్-ఎ గ్రేడ్ సాధించామన్నారు. అటానమస్ హోదా సాధించిన ఫార్మసీ కళాశాల జిల్లాలో ఇదొక్కటేనని తెలిపారు. ఈ మేరకు సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, అధ్యాపక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ద్వారకాతిరుమల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధుడు ఆ బాధను భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ద్వారకాతిరుమల మండలంలోని కొత్తగూడేనికి చెందిన గుత్తుల రామకృష్ణ(65)కు రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. పొలం నిమిత్తం తీసుకొచ్చిన పురుగుల మందును మంగళవారం సాయంత్రం తాగేశాడు. దీన్ని గమనించిన కుమారుడు పాటియ్య తండ్రి రామకృష్ణను జంగారెడ్డిగూడెం అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. పాటియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విషపు పురుగు కుట్టి ఒకరి మృతి

టి.నర్సాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని విషపు పురుగు కుట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన చిన్ని బాలాజీ(44)ఈ నెల 12వ తేదీ రాత్రి 9గంటల సమయంలో వరి పొలంలో మోటర్ ఆన్ చేయడానికి నడుచుకుంటూ వెళ్తుండగా గ్రామ శివారులో కుడికాలు మీద గుర్తు తెలియని విషపు పురుగు కుట్టినట్లు అనిపించి చూసుకోగా రెండుగాట్లు కనిపించాయి. ఇంటికి వచ్చి విషయం కుటుంబ సభ్యులకు తెలపగా 108 అంబులెన్స్‌లో చింతలపూడి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితికి వెళ్లిన బాలాజీని పరీక్షించి చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించారు. భార్య చిన్ని దుర్గ ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కే.వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కాళ్ళ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూలి పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి ఘటన బుధవారం దొడ్డనపూడిలో చోటుచేసుకుంది. కాళ్ళకూరు గ్రామానికి చెందిన ఉబ్బా వెంకన్న(36)కూలీ పని నిమిత్తం దొడ్డనపూడి వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా వర్షపు చినుకుల కారణంగా కరెంట్ షాక్ కొట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంకన్నను వైద్యం నిమిత్తం కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకన్నకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోదరుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

ఇంటికి నిప్పంటుకుని యువకుడికి గాయాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలి తాటాకింటికి నిప్పంటుకున్న ఘటనలో ఒక యువకుడు తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని వేంపాడులో జరిగింది. గ్రామానికి చెందిన పెండ్లి మధు ఆరోగ్యం సరిగా లేక పోవడంతో తన తాటాకింట్లో బుధవారం రాత్రి నిద్రపోతున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ గ్యాస్ సిలెండర్ అకస్మాత్తుగా పేలి ఇంటికి నిప్పంటుకుంది. చుట్టు పక్కల వారు ఇంట్లో ఉన్న మధుని బయటకు తీసుకొచ్చి హుటాహుటిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

స్వీటు షాపు దగ్ధం.. రూ.రెండు లక్షల ఆస్తినష్టం

ఏలూరు క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒక స్వీటు షాపులోని ఐస్‌క్రీమ్ ఫ్రీజర్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో స్వీటు షాపు దగ్ధమై రెండు లక్షల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. ఏలూరు కన్నయ్యపార్కు సెంటర్‌కు చెందిన కె.వి.సురేష్‌గుప్తా వన్‌టౌన్‌లో గృహలక్ష్మి స్వీట్‌షాపును నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఆ షాపులో ఉన్న ఐస్‌క్రీమ్ ఫ్రీజర్ నుంచి అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద సమాచారం అందుకున్న జిల్లా అదనపు అగ్నిమాపకశాఖ అధికారి వి.రామకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు చుట్టు పక్కల షాపులకు, ఇండ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఆపరేషన్ ట్రేస్ వేగవంతం

తప్పిపోయిన, అనాథ పిల్లల తల్లిదండ్రులను గుర్తించే పనిలో పోలీసులు

ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్న ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలల ఆచూకీ గుర్తించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని అనాథ బాలలుగా వివిధ హోమ్స్‌ల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించే ప్రక్రియ చేపట్టామని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు మేరకు ఆపరేషన్ ట్రేస్‌ను ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, ఎన్‌జీవో హోమ్‌లలో ఉన్న అనాథ బాలబాలికల వివరాలు తెలుసుకుని వారి తల్లిదండ్రులను గుర్తించి అప్పగించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకూ 12 మంది తప్పిపోయిన బాలబాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, శక్తి టీమ్ కలిసి శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని బాలలతో మమేకమై వారి నుంచి వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. 2019లో తన పిల్లలను తీసుకుని తల్లి వెళ్లిపోవడంతో వరంగల్‌లో ఉన్న తల్లి, తన పిల్లలను తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. జిల్లాలో మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.ఎక్కడైనా బాలబాలికలను కార్మికులుగా పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు. ఏలూరు శనివారపుపేటలో ఉన్న 12 మంది బాలల తల్లిదండ్రులెవరో తెలియకపోవడంతో వారిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి తీసుకురాగా ఎస్పీ స్వయంగా ఆ బాలలతో గంటన్నరపాటు మాట్లాడి వారి వివరాలు సేకరించే ప్రయత్నం చేపట్టారు. అందులో నలుగురి ఆచూకీ ప్రాథమికంగా లభ్యమైనట్టు తెలుస్తోంది. వారి తల్లిదండ్రులకు అప్పగించేందుకు చర్యలు వెంటనే చేపట్టారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహ సూపరింటెండెంట్ శ్రీవల్లి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు వి.వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ నాగమణి పలువురు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

భర్తను అప్పగించి న్యాయం చేయండి



ఆందోళన చేస్తున్న యువతి బంధువులు

భీమవరం టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భీమవరంలో జరుగుతున్న పెళ్లి కల్యాణ మండపం వద్ద ఓ మహిళ, తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం నిరసన తెలిపింది.తన భర్తను అప్పగించాలంటూ డిమాండ్ చేసింది. భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన ఖండవల్లి నిర్మల పౌలిన్, ఉండి మండలం నక్కరాజుగుంట గ్రామానికి చెందిన ఖండవల్లి రవిరాజాకు 2019లో వివాహం జరిగిందని, తమకు ఒక కుమారుడు కూడా ఉన్నాడని నిర్మల తెలిపింది. మూడేళ్లుగా రవిరాజా తనకు దూరంగా ఉంటున్నాడని భార్య నిర్మల తెలిపింది. బుధవారం భీమవరం రైల్వే కాలనీలోని కల్యాణ మండపంలో రవితేజ వివాహం జరుగుతుండగా తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు నిరసన తెలియజేశారు. లేదంటే కలెక్టర్, ఎస్పీకి తమ సమస్యను తీసుకెళ్తానని తెలిపింది. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ బాధితకుటుంబానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు అక్కడకు వచ్చి ఇరువురికి సర్దిచెప్పారు. త్వరలో కూర్చుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. వర్ధనపు మోషే, పవన్ నరసింహం, ఈది రాజశేఖర్, మద్దా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

మండవల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గంజాయికి అలవాటుపడటంతో పాటు పెద్ద ఎత్తున యువతకు విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మండవల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండవల్లి పోలీస్ స్టేషన్లో కైకలూరు రూరల్ సీఐ రవికు మార్, ఎస్ఐ రామచంద్రరావు బుధవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కైకలూరు వెలమపేటకు చెందిన షేక్ ఫరీద అబ్బాస్, ముదినేపల్లి మండలం దేవపూడికి చెందిన ఎలికే రాజేష్ కొంతకాలంగా గంజాయికు బానిసలుగా మారారు. ఒడిశా రైల్వే స్టేషన్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం చావలిపాడు వద్ద ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 755 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. తెలిపారు. ట్రైనింగ్ ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

» డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



చాక్లెట్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, కలెక్టరు నాగరాణి

ఉండి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య సభ్యులు పలు పరిశ్రమల స్థాపనతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణ రాజు అన్నారు. బుధవారం మహదేవపట్నంలో మహం కాళమ్మ స్వయం సహాయక సంఘానికి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.8.75 లక్షల సబ్సిడీతో మంజూరు చేసిన రూ.25 లక్షల వ్యయంతో స్లోబీన్ చాక్లెట్ ఫ్యాక్టరీని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు నాగరాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు కలుపకుండా తయారుచేసే చాక్లెట్స్ ఆరోగ్యానికి మేలు చేస్తాయని పరిశోధనలో తేలిందన్నారు. కలెక్టరు నాగరాణి మాట్లాడుతూ చాక్లెట్ల తయారీ విధానం, వినియోగించే ముడి సరుకులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రూపు నిర్వాహకురాలు కవురు నవ్యశ్రీ, జనసేన కన్వీనరు జుత్తుగ నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మీశ్రీను, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపుల నుంచి విముక్తి కల్పించండి

» 'పశ్చిమ' జిల్లా కలెక్టర్ నాగరాణికి కార్మిక సంఘ నాయకుల వినతి

భీమవరంటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : భీమవరం మునిసిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్ వేధింపుల నుంచి పారిశుధ్య కార్మికులకు విముక్తి కలిగించాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీ యూసీ జిల్లా కార్యవర్గసభ్యులు చెల్లబోయిన రంగారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కొల్లాబత్తుల మహంకాళి కోరారు. బుధవారం భీమవరంలో కలెక్టర్ నాగరాణికి పలు డిమాండ్లతో కూడిన వితిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భీమవరం పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంటు, ఆప్కాస్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నిత్యం అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఉదయం ఐదు గంటలకు ముందే మస్తరుకు రావాలని ఆదివారం సెలవు రోజున పనులు చేయాలని లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చ రిస్తున్నారని తెలిపారు. జేఏసీ నాయకులు నీలాపు శ్రీను, ఎం.ఆంజనేయులు, నీలాపు రాము, బంగారు వరలక్ష్మి, కొల్లాబత్తుల యోహాను, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

టోల్ గేట్ వద్ద డ్రంకెన్ డ్రైవ్

ఉంగుటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 20 మంది కేసు నమోదు చేసినట్టు సి.ఐ. ఎస్.రజనీ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఉంగుటూరు టోల్ గేట్ వద్ద మంగళవారం రాత్రి నిడమర్రు సర్కిల్ సిబ్బంది, ఏలూరు డీటీఆర్‌బీ సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.

బైకుని ఢీకొట్టిన ఆటో.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చాట్రాయి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-వెలగలపల్లి రహదారి(వీవీరోడ్డు)లో మంకొల్లు గ్రామం వద్ద బుధవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని ట్రక్ ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం యడవల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మండలంలోని పోలవరం వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా మంకొల్లు గ్రామం వద్ద ఎదురుగా లారీ వస్తుందని రోడ్డు పక్కన ఆగారు. అదే సమయంలో చింతలపూడి నుంచి జామాయిల్ కర్రల లోడుతో వస్తున్న ట్రక్ ఆటో బైక్‌ని బలంగా ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు వచ్చి గాయపడిన వారికి సపర్యలు చేసి అనంతరం ఆసుపత్రికి తరలించారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి

కొయ్యలగూడెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని మానవత మండలాధ్యక్షుడు మండపాటి రామకృష్ణ కోరారు.ఈ మేరకు మండలంలోని అంకాలగూడెం గ్రామంలో కూనపం రవి అనే వ్యక్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మానవత సంస్థ అతనికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి మానవత సంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యదర్శి చంటిబాబు, సవ్వా రాము, ఎం.వెంకటేశ్వరరావు, జి.రామ్మోహన్, బాబి పాల్గొన్నారు.

యర్రగుంటపల్లిలో పారిశుధ్యాన్ని పరిరక్షించండి

చింతలపూడి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యర్రగుంటపల్లి పంచాయతీలో మెయిన్ రోడ్డుపై గృహాల్లో వాడిన మురుగును మెయిన్ రోడ్డుపై వదులుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీని వల్ల ఆర్అండ్‌బీ రోడ్డు గోతులు కావడమేకాక ఈ మార్గంలో ప్రయాణించే వారికి అపరిశుభ్ర గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని చెబుతున్నారు. అంతేకాక ఆర్అండ్‌బి స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, పంచాయతీ అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

10 ఏళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు : ఎమ్మెల్యే సొంగా

చింతలపూడి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి నిధులు కూడా కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ 2014-19లో ఉపాధి పనులకు కోటి 45 లక్షల పనులు జరగ్గా 59 లక్షలు చెల్లించారని, రూ.86 లక్షలు ఇవ్వాల్సి ఉందన్నారు. 2024-25లో 15 కోట్ల 10 లక్షలు ఉపాధి నిధులు మంజూరుకాగా ఇంకా 11.52 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు విడుదల చేశామన్నారు. కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు.

ఉనికిలి సొసైటీ భూముల వివాదంపై జేసీకి ఫిర్యాదు

ఏలూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గత 40 ఏళ్లుగా కొనసాగుతున్న భూముల లీజు వాటాలు సమానంగా పంచాలని మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన దళితులు బుధవారం దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉనికిలి గ్రామంలో మాల, మాదిగ, మాలదాసు సామాజిక వర్గానికి చెందిన వారు ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యుల మధ్యవిభేదాలు సృష్టించారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సొసైటీ భూముల తరపున తమకు వచ్చే ఫలసాయం అందేలా చూడాలని జాయింట్ కలెక్టర్‌కు ధాత్రి రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు కె.రాజబాబు, గునిపూడి యోహాను, వి యోసేపు, కే సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పది వారాలకు పైగా బకాయి పడ్డ వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మీడియం రవి దొర అధ్యక్షత వహించగా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయన్నారు. మే నుంచి ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఉపాధి కూలీ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని, రోజువారి కూలీ రూ.600 పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెట్రీ సెల్వి, డ్వామా పీడికి వినతిపత్రాలు అందజేశారు. ముప్పిడి రాజారత్నం, కొమరం రామారావు, దాడి రాముడు పాల్గొన్నారు.

కె.జగ్గవరం సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా : బొంతు


బొంతు సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

టి.నర్సాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కే.జగ్గవరం సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్ పర్సన్ బొంతు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘ అధ్యక్షుడిగా గతంలో చేసిన అపార అనుభవంతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. సొసైటీని ప్రగతిపథంలో నడిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సత్యనారాయణను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరి వెంకటచలపతిరావు ఘనంగా సన్మానించారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

ఏలూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈనెల 15వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమల్లో ఎటువంటి లోటుపాట్లు విమర్శలకు అవకాశం లేకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ముందు మహిళలకు ఎన్నో పథకాలు చెప్పామని, దానిలో ఉచిత బస్సు పథకానికి మహిళలు మొగ్గు చూపారన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తా : జడ్పీ చైర్ పర్సన్

ఏలూరు క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజుతో సమావేశమై ఆసుపత్రి పరిస్థితులపై వివరాలడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఘంటా ప్రసాదరావు ఉన్నారు.

మాదేపల్లిలో పూర్తయిన భూముల రీసర్వే

ఏలూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో భూముల రీసర్వేను జనవరి 20న చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామ పరిధిలో 200 నుంచి 250 ఎకరాలకు ఒక బ్లాక్‌గా విభజించి అధునాతన సాంకేతిక ఆధారంగా అందరి సమక్షంలో కచ్చితమైన హద్దులు నిర్ణయించి గ్రామానికి నాలుగు బృందాల చొప్పున సర్వే చేసి జాయింట్ ఎల్‌పీఎంలను సింగిల్ ఎల్పీఎంలుగా నమోదు చేసి సమస్యలను పరిష్కరించారు. ఇప్పటి వరకు గ్రామంలో 1507 ఎకరాలు సర్వే పూర్తి చేసి సరిహద్దులు నిర్ణయించినట్టు తహసీల్దార్ గుడిపూడి విజయ్‌కుమార్‌రాజు తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా రీసర్వే చేశామని తెలిపారు. సర్వేయర్ శ్రీనివాస్, టీడీపీ నాయకులు పైడిపాటి శేఖర్, సొసైటీ చైర్మన్ పవన్ పాల్గొన్నారు.

ఇంకెప్పుడు?

(5వ పేజీ తరువాయి)

స్థానం రాకపోతుందా అని ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం కావడంతో వీరిద్దరే కాకుండా మరికొందరు సీనియర్ నేతలు పార్టీ తమను కూడా గుర్తించి అవకాశం ఇస్తుందని భావించారు. వీరికి తోడు అధికార ప్రతినిధి శ్యామచంద్ర శేషు దీర్ఘకాలికంగా ఇలాంటి ఆశతోనే ఉన్నారు. పార్టీలో నారా లోకేశ్ ఆశీస్సులున్న శేషుకి త్వరలోనే ఏదైనా కార్పొరేషన్‌లో చోటు దక్కుతుందని భావిస్తున్నారు.తాజాగా దెందులూరు నియోజకవర్గానికి చెందిన ఘంటశాల లక్ష్మికి ఏపీ వడ్డీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. కొల్లేరు వాసుల్లో అత్యధికులు ఈ సామాజిక వర్గానికి చెందిన వారే. దీనిని దృష్టిలో పెట్టుకుని జనసేన పక్షాన ఇంతకుముందు దెందులూరు నుంచి పోటీ చేయాలని లక్ష్మి భావించారు. అప్పట్లో అదిసాధ్యం కాలేదు కాబట్టి ఇప్పుడు కార్పొరేషన్‌లో కీలక పదవిని ఆమెకు అప్పగించినట్లైంది.

కుండపోత

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో, టోల్‌ఫ్రీ నెంబరు 1912కు గాని, కంట్రోల్ రూమ్‌లకు గాని తెలపాలన్నారు.

పోలీస్ శాఖ అప్రమత్తం

ఏలూరు క్రైం: వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర విప త్తుల నిర్వహణ శాఖ వాతావరణ హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఎక్కడైనా వాగులు, వంకలు, కాలువలు దాటే సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా రాత్రి వేళగస్తీ ముమ్మరం చేశారు. ఎక్కడైనా చెట్టుకొమ్మలు పడిపోయి ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన చెట్లను తొలగించడానికి కట్టర్స్ పని వార్లను సిద్ధం చేశారు. ఎక్కడైనా ఏదైనా ప్రమాద సంఘటన ఉంటే వెంటనే 112కు సమాచారం అందించాలని, తక్షణ సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

జాతీయ ఐక్యతను పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

దెందులూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలుసుకుని ముందుకు సాగాలని దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత అన్నారు.బుధవారం దెందులూరు నియోజకవర్గంలోని గోపన్నపాలెం(లక్ష్మీపురం) గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యదర్శి పి.నాగరాజు ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని డైరెక్టర్లు మద్దాల దయానందరాజు, అల్లు జ్యోతి, పుసులూరి ప్రసాద్‌తో కలిసి ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. డైరెక్టర్లు బాలిన కుమారి, వైవాక రాజాతో పాటు వ్యవసాయ మర్కెట్ కమిటీ సూపర్ వైజర్లు, సిబ్బంది, నిమ్మకాయల వర్తక సంఘం నాయకులు ఆలపాటి రంగారావుతో పాటు పలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు:చేబ్రోలు గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ, బీజేపీ శ్రేణులు జరిపిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సర్పంచ్ రాంధే లక్ష్మి సునీత, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, నాయకులు నగరపాటి సత్యనారాయణ, అడపా శోభారాణి, మండలాధ్యక్షుడు వంజరపు దుర్గారావు, బొమ్మిడి అప్పారావు, రుద్రరాజు శ్రీనివాస రాజు, పంది రాంబాబు, గంజి బాలాజి పాల్గొన్నారు.

● భీమడోలు: భీమడోలులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. భీమడోలు జంక్షన్ నుంచి కూటమి నేతలు మాధురి కళాశాల విద్యార్థులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపుతో ర్యాలీకి విశేష స్పందన వచ్చింది. బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, ప్రవీణ్‌పటేల్, కూటమి నేతలు పాల్గొన్నారు.


భీమడోలులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమమే లక్ష్యం

లింగపాలెంలో ఎడ్లబండ్లు, కొయ్యలగూడెంలో ట్రాక్టర్లపై నాయకుల భారీ ర్యాలీలు

అన్నదాత సుఖీభవ పథకం పట్ల హర్షం


ఎడ్లబండ్ల ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

ఏలూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మొదటి విడత నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిన ఆనందంలో లింగపాలెం నుంచి ధర్మాజీగూడెం వరకు నాలుగు వందల ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో అన్నదాతలు భారీ ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. అనంతరం ధర్మాజీగూడెంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేలా స్త్రీశక్తి పథకం అందిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పోలవరం, రాజధాని అమరావతిని, చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేస్తారని అన్నారు. గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, గుత్తా సత్యసాయి వరప్రసాద్, ముత్తారెడ్డి, పాతూరి శ్రీను, నిమ్మగడ్డ సుధాకర్, తాతిన రాధా కృష్ణ, బోడా అనీష్, పల్లి శ్రీను పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: రైతు సంక్షేమమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు.బుధవారం కొయ్యలగూడెంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలును ఉద్దేశించి రైతులు, టీడీపీ నాయకులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆయన ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు నెరవేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, ఏఎంసీ చైర్మన్ పుట్టా రామారావు, టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్, గంగిరెడ్ల మేఘలాదేవి, చింతల వెంకటరమణ, ఆకుల అరుణ పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


స్వీపింగ్ మిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఏలూరును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.51 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్‌ను ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్‌నూర్జహాన్‌లు ప్రారంభించారు. 3 టన్నుల సామర్థ్యం కలిగిన స్వీపింగ్ మిషన్‌తో రోడ్లను శుభ్రపరుస్తామన్నారు. అనంతరం వన్‌టౌన్ చేపల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన టాయిలెట్స్ ప్రారంభించారు. నగర కమిషనర్ భాను ప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహావిష్కరణ

ఉంగుటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఉప్పాకపాడులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు.రాచూరుకు చెందిన రామిరెడ్డి మౌనిక దంపతులు అన్న సమారాధన చేశారు. వంట షెడ్డును భక్తుల విరాళాలతో నిర్మించారు.బాబా ఆలయంలో ఉపాధ్యాయురాలు శ్రీవల్లి, సత్యనారాయణ దంపతులు ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉంగుటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నిడమర్రు సబ్ స్టేషన్‌లో పనుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. విద్యుత్ శాఖ అధికారి అంబేడ్కర్ మాట్లాడుతూ బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీంతో రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాల చేపల చెర్వులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

బుట్టాయగూడెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరం శివారులోని తూటుకుంట ఆర్ అండ్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. దిప్పకాయలపాడుకు చెందిన గన్నమని ప్రసాద్ ఆధ్వర్యంలో గుడివాడ మండలం జంటకురు గ్రామానికి చెందిన పొట్లూరి స్వరాజ్యలక్ష్మి విగ్రహాలను సమర్పించినట్టు ధర్మకర్త బొమరాజు ధనుంజయరాజు తెలిపారు. స్వామివారి శాంతి కల్యాణం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో అన్నసమారాధన జరిపించారు.

రెండోరోజు ఎన్ఎంయూ ధర్నా

ఏలూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రెండురోజు కూడా ఏలూరు ఆర్టీసీ డిపో ముందు నాయకులు, ఉద్యోగులు ధర్నాను బుధవారం కొనసాగించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆర్టీసీ ఆస్తుల ధారాదత్తం చేయడాన్ని విరమించుకోవాలని నినాదాలు చేశారు. డిపో ఎన్ఎంయూ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పీసీహెచ్ శేఖర్, పీవీవీవీ ప్రసాద్, చైర్మన్ కేఆర్‌కే రావు, గ్యారేజ్ కార్యదర్శి పి.హరిబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ఉంగుటూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ యేడాది రూ.19.92 కోట్ల ఉపాధి పనులు నిర్వహించామని డ్వామా పి.డి.సుబ్బారావు తెలిపారు. బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన మండల సామాజిక తనిఖీల్లో భాగంగా ఆయా గ్రామాల వారిగా సమీక్ష జరిపారు. పలు చోట్ల మస్తర్లపై అభ్యంతరాలను పరిశీలించి రికవరి పెట్టారు. సమీక్షలో ఎ.పి.డి.పురుషోత్తం, రాళ్ళకంటి విక్టర్, జిల్లా తనిఖీ అధికారి నేతి బుజ్జి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీవో రాజ్ మనోజ్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పట్ల హర్షం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల షాపులకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం పట్ల నాయీబ్రాహ్మణ సేవా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు బడేటి చంటి కలిసి సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు సహకరించిన ఎమ్మెల్యే చంటి కృతజ్ఞతలు తెలిపారు.

గణపతి ఆలయంలో రాట పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : పవరుపేటలోని విజయ గణపతి ఆలయం వద్ద ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా ఇందుకు సంబంధించిన రాట పూజలను ఆలయ ప్రధాన అర్చకులు కందుకూరి త్రినాధ మూర్తి ఆధ్వర్యంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో బుధవారం జరిపించారు. తొలుత ఎమ్మెల్యే చంటి ఈ సందర్భంగా విజయ గణపతి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వెంట ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, డివిజన్ తెలుగుదేశం ఇన్‌చార్జి దాకారపు రాజేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, విజయగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నౌడూరి వాసు, శీర్ల వాసు, వీరవల్లి రామకృష్ణ, ఘంటా బాబ్జీ, రాంబాబు, ఆర్నేపల్లి తిరుపతితోపాటు గణేష్ మాలదారులు, భక్త బృందం పాల్గొన్నారు.


చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్యం పరిశీలన

దెందులూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ పనులు పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ అన్నారు. బుధవారం దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త ఇంటింటి చెత్త సేకరణ పనులను పంచాయతీ కార్యదర్శి పెదప్రోలు ఆదిలక్ష్మిలతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం సోమవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.


హోటళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీసులు

దాబాల నిర్వాహకులకు దిశానిర్దేశం

భీమడోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భీమడోలు, ద్వారకా తిరుమల మండల పరిధిలో హైవేల సమీపంలో నిర్వహిస్తున్న హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో అనధికార మద్యం సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు సీఐ విల్సన్ హెచ్చరించారు. భీమడోలు సర్కిల్ కార్యాలయంలో హోటళ్ల నిర్వాహకులతో సీఐ మాట్లాడుతూ ప్రతి రెస్టారెంట్ ముందు రోడ్డు కనిపించేలా సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని, కొత్త వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి 10.30 గంటలకు రెస్టారెంట్లు, దాబాలను మూసి వేయాలన్నారు. ఎస్ఐ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల సర్వేను అడ్డుకున్న గిరిజనులు

బుట్టాయగూడెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వివాదాల్లో ఉన్న భూములను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేయడానికి రెవెన్యూ అధికారులు చేస్తున్న భూముల సర్వేను బుధవారం గిరిజనులు అడ్డుకున్నారు. అంతర్వేదిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని భూమిని సర్వే చేస్తుండగా ఇనుమూరుకు చెందిన గిరిజనులు అడ్డుకున్నారు. వివాదాల్లో ఉన్న భూములను ఆర్ అండ్ ఆర్‌లో ఎలా కొనుగోలు చేస్తారని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ,గిరిజనులు ప్రశ్నించడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామసభలు జరపకుండా భూసర్వేలు నిర్వహిస్తే ప్రతిఘటిస్తామన్నారు.

పేదలకు భూములు అప్పగించాలి

టి.నర్సాపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే అప్పగించాలని సీపీఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు కోరారు. టి.నర్సాపురంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని ఏపిగుంట పంచాయతీలో సాగు చేసుకుంటున్న భూములను ఏపీగుంట, రామన్నగూడెం, బచ్చులేటిగూడెం గ్రామాలకు చెందిన పేదలు, గిరిజనులు, సాగు చేసుకుంటున్నారన్నారు. కొందరూ నాయకులు ఆ భూముల్లో కందకాలు తవ్వించి కలుపు మందు కొట్టించి, జీడిమొక్కలు చంపేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెదవేగి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న వేగివాడకు చెందిన మాధుసాయికి, చక్రాయిగూడెంలో జుత్తిగ శ్రీరామమూర్తి కుటుంబానికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం అందజేశారు. దీంతో లబ్ధిదారులు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నాయీబ్రాహ్మణ సంఘం హర్షం

కామవరపుకోట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు రాయితీ ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు చెబుతున్నారు. ఈ మేరకు కామవరపుకోటలో బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కొప్పాక వీర వెంకట సత్యనారాయణ, చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు చిప్పడ నరసింహరావు, కామవరపుకోట టౌన్ అధ్యక్షులు చేడే నాగరాజు, కార్యదర్శి వెంకటాచలం, బద్రీలు పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ఏలూరు అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ, పీజీ విద్యార్థినులకు వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్, గీతాలాపన, నృత్య రూపకం పోటీలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకత గురించి అధ్యాపకులు జ్యోతికుమారి, అనూష వివరించారు. వంటకాల పోటీలో మానవత సంస్థ ప్రతినిధి డాక్టర్ ఉత్తమదుర్గకు ప్రథమ బహుమతి, రెడ్ క్రాస్ నర్సింగ్ స్కూల్ ప్రతినిధి ఎస్.మణిరత్నంకు ద్వితీయ బహుమతి లభించాయి. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, పీజీ కోర్సుల డైరెక్టర్ సిస్టర్ సుశీల పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మద్రాస్ రాము

సొసైటీ చైర్మన్ల బాధ్యతలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):సహకార సంఘాల చైర్మన్‌లు రైతులకు మేలు చేకూర్చడంతో పాటు సంఘ అభివృద్ధికి పాటుబడాలని గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అన్నారు. మండలంలోని రామన్నగూడెం, జి.కొత్తపల్లి త్రిసభ్య కమిటీలు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రామన్నగూడెం సొసైటీ చైర్మన్‌గా మద్రాస్ రాము, జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్‌గా రేగంటి రాంబాబులు బాధ్యతలు చేపట్టగా యద్దనపూడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ద్వారకాతిరుమల, తిరు మలంపాలెం సొసైటీల చైర్మన్‌లు పోలిన శ్రీనివాస రావు, మాసిరెడ్డి హరిబాబు, లంకాసత్తిపండు, మొగతడకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండూరులో త్రిసభ్య కమిటీ..

దెందులూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండూరు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కొనకళ్ల శివమణి గౌడ్, సభ్యులుగా వెలవెల నాగరాజు, బట్టు రాజారావులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. పెదవేగి టీడీపీ మండలాధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత ముఖ్య అతిథులుగా పాల్గొని వారిని అభినందించారు.

రాంప్రసాద్ నియామకం పట్ల హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బుచ్చి రాంప్రసాద్‌ను నియమించడం పట్ల ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి గౌరవ అధ్యక్షుడు తురగా రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు వెస్ట్ నుంచి టీడీపీ నేతగా చాలా ఏళ్లుగా కొనసాగుతున్న రాంప్రసాద్ కష్టానికి తగిన ఫలితం లభించిందని, బ్రాహ్మణ సామాజిక వర్గ అభ్యున్నతి కోసం ఎన్నో ఏళ్ళుగా రాంప్రసాద్ పాటుపడుతున్నారని అన్నారు. అలాగే రాంప్రసాద్‌కు ద్వారకా తిరుమల దేవస్థానం పంచాంగకర్త కాశీబొట్ల పార్వతీశ్వరశర్మ అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలి

భీమడోలు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులందరికీ సదరం సర్టిఫికెట్లను మంజూరు చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. గుండుగొలను ప్రాథమిక వైద్య కేంద్రంలో జరిగిన సదరం క్యాంపు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇటీవల పల్లెపల్లెకి పత్సమట్ల కార్యక్రమంలో దివ్యాంగుల వినతి మేరకు ఈ క్యాంపు ఏర్పాటు చేశారు. అనంతరం గుండుగొలను కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో యువజన దినోత్సవం

చింతలపూడి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పలు పోటీలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని వివిధ డిగ్రీ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. సమన్వయకర్త బి.సరస్వతి, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐటీడీఏ పీవో రాములు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కెఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ తెలిపారు.ఐటీడీఏలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వాడకం వల్లే నేరాల రేటు పెరుగుతుందన్నారు. ఐటీడీఏ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ ఎన్నిక

పెదపాడు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): క్రీస్తు ప్రవచనాలు బోధిస్తూ ఇతరులను సన్మార్గంలో నడిపించడానికి కృషి చేస్తున్న దేవుని సేవకుల పాత్ర అభినందనీయమని దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత అన్నారు. పెదపాడు కో-ఆపరేటివ్ బ్యాంకు సమావేశ మందిరంలో పెదపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రారంభ కార్యక్రమం, కార్యవర్గ ఎన్నిక బుధవారం నాయుడుగూడెం ప్యారీస్ గురువులు రెవ. జి.సాల్మన్‌రాజు అధ్యక్షతన జరిగింది. ఏపీపీఎఫ్ నేషనల్ జనరల్ సెక్రటరీ రెవ. పి.జీసస్‌కుమార్, ఆర్‌సీఎం వికార్ జనరల్ ఫాదర్ బాలలు ముఖ్యఅతిథులుగా పాల్గొని సంఘాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. గుత్తా అనిల్, అక్కినేని వంశీ, మరడాని రవి, నూతన అసోసియేషన్ కమిటీ గౌరవ అధ్యక్షులు రెవ. జాషువా రాజు, బ్రదర్ బి.బాబురావు, రెవ. జాన్ విలియమ్స్, బ్రదర్ పి.బాబురావు పాల్గొన్నారు.

పోలీసుల కృషి అభినందనీయం

అనాథల తల్లిదండ్రులను గుర్తించడం పట్ల హర్షం

ఏలూరు క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అనాథలుగా ఉన్న బాలల ఆచూకీ గుర్తించి వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చడం అభినందనీయమని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా ఎస్పీ కె.పి.ఎస్.కిషోర్‌కు బుధవారం సాయంత్రం ప్రశంసా పత్రాన్ని అందజేసింది. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు టీమ్ సభ్యులు, కానిస్టేబుల్ గోపాలకృష్ణ, మహిళా కానిస్టేబుల్ బి.సుజాత ఈనెల 6న శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడి బాలల సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న బాలల్లో ఆరుగురి తల్లిదండ్రుల ఆచూకీ గుర్తించారు. ఈనేపథ్యంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రెబ్కారాణి, సభ్యులు హైమావతి, పి.వెంకటేశ్వరరావు, సి.హెచ్.రాజేశ్వరరావులు కలిసి ఎం.సుబ్బారావు, సభ్యులు, కానిస్టేబుళ్ల గోపాలకృష్ణ, బి.సుజాతలను అభినందిస్తూ లేఖను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్‌కు అందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే

జీలుగుమిల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో పురోగతిపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆరా తీశారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలో ఆయా మండలాల ఎంపీడీవోలు జనసేన మండల పార్టీల అధ్యక్షులు సమీక్ష నిర్వహించారు. మండల స్థాయిలో అధికారులు పరిష్కరించలేని సమస్యలు, గ్రామీణ రహదారుల మరమ్మతులు, పంచాయతీల్లో రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం, ప్రజలు వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా చేపట్టాల్సిన పారిశుధ్య పనులు, తాగునీటి పైపులైన్‌లు లీకులు కాకుండా సురక్షిత మంచినీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాల్లో భవనాల పరిస్థితి, ఉపాధ్యాయుల పనితీరు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, వైద్యం సదుపాయాలు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధి వంటి అంశాలపై సమగ్ర సమీక్ష జరిపారు. ఉపాధి పనులపై ఎంపీడీవో, ఏపీడీ, పంచాయతీరాజ్ డీఈ, ఏఈలతో చర్చించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్,పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, ఎంపీడీవో టి.నిఖిల్ మధుశరణ్ ఉన్నారు.

పారదర్శకంగా భూ రీసర్వే పూర్తి : తహసీల్దార్

కలిదిండి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):పారదర్శకంగా భూ రీసర్వే పూర్తి చేశామని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. బుధవారం వెంకటాపురంలో భూ రీసర్వేపై ముగింపు గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకటాపురం, కాళ్లపాలెం గ్రామాలను పైలట్ ప్రాజెక్టులుగా తీసుకుని భూ రీసర్వే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేశామన్నారు. ఇకపై భూముల ఎల్‌పీఎం నంబర్లు పక్కాగా ఉంటాయన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, ఆర్ఐ శ్యామల, వీఆర్వో కమలహాసన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన

చాట్రాయి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను హెచ్ఎం వెంకట్రావు వివరించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తుమ్మగూడెం దళితవాడ పాఠశాలలో గంజాయి, ధూమపానం, గుట్కా మొదలైన చెడు అలవాట్ల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఎంసీ చైర్మన్ సత్యవతి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సారథి


ముదినేపల్లిలో ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

నూజివీడు/ముదినేపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో చేయూతను అందించేందుకు రూ.20వేల నగదును రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఎన్నికల హామీని ప్రభుత్వం నెరవేర్చిందని తొలి విడత నిధులను రైతుల ఖాతాలలో జమ చేసిందని దీనిలో భాగంగా జిల్లాలోని 1,60,968 మంది రైతులకు రూ. 107.08 కోట్లు జమ చేశామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ ఇంకా రైతులకెవరికైనా సాంకేతిక కారణాలతో నిధులు జమ కాకపోతే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. నియోజకవర్గంలో 35,529 మంది రైతులకు రూ.23.64 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

ముదినేపల్లిలో రైతుల సంబరాలు

ముదినేపల్లి మండలంలో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లిలోని ఎన్డీఏ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, రైతులు క్షీరాభిషేకం జరిపి రైతులను ఆదుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు చల్లగుళ్ల ఆదిత్య చౌదరి, కోడూరు శేషుబాబు, బొంగు రవికుమార్, పరసా విశ్వేశ్వరరావు, హనుమాన్ పెద్దిబాబు, గుడివాడ వేణు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిప్రోలు కృష్ణారావు, నాయకులు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

గుడిపాడులో 'పొలం పిలుస్తోంది'


మాట్లాడుతున్న ఏవో చాముండేశ్వరి

ముసునూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు గద్ది రాముబాబు, సీనియర్ నాయకుడు కొల్లి గంగారామ్ అన్నారు. బుధవారం గుడిపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగం కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, బిందుసేద్యం పరికరాలు తదితర వాటిని అందిస్తున్నదని తెలిపారు. ఏవో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి కోసం ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్, హౌస్‌హోల్డ్ సర్వే చేయించుకుని విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. ఇంకా అర్హత కలిగిన రైతులు ఈనెల 20వ తేదీలోపు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు, రైతుసేవా సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నగదుతో అంతర్గత రహదారుల అభివృద్ధి

» టీడీపీ యువనేత గణేశ్ పనితీరుపై స్థానికుల హర్షం


గోపవరంలో రహదారి అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న గణేశ్

ముసునూరు,ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న అంతర్గత రహదారులను ఎట్టకేలకు గ్రావెల్‌తో అభివృద్ధికి నోచుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో తట్టమట్టి కూడా వేయకపోవడంతో వరికంకి అధ్వానంగా మారిన రహదారులను కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేశ్ ఆర్థిక సహకారంతో అభివృద్ధి చెందాయి. బీసీ, ఎస్సీ, ఓసీ కాలనీల్లో 600 మీటర్ల పొడవున ఉన్న అంతర్గత రహదారులను సుమారు రూ.1.50 లక్షల నగదును ఖర్చు చేసి 300 ట్రిప్పుల గ్రావెల్‌ను ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల ద్వారా తరలించి, లెవెల్ చేసి అభివృద్ధి పనులను బుధవారం పూర్తి చేయించారు. సొంత నగదుతో రహదారులను అభివృద్ధి చేసిన గణేశ్ పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌ని ఢీకొట్టిన ఆటో.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చాట్రాయి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-చెంగంపల్లి రహదారి (పీ వీరోడ్డు)లో మంకొల్లు గ్రామం వద్ద బుధవారం రాత్రి ద్విచక్రవాహనాన్ని ట్రక్ ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలివి. లింగపాలెం మండలం ధర్మాజీపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మండలంలోని పోలవరం వెళ్లి తిరిగి స్వగ్రామం వెళుతూ మంకొల్లు గ్రామం వద్ద ఎదురుగా లారీ వస్తుండటంతో రోడ్డు పక్కన ఆగారు. అదే సమయంలో వింతలపల్లి నుంచి పాలకాయ లోడుతో వస్తున్న ట్రక్ ఆటో బైక్‌ని బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు వచ్చి గాయపడిన వారికి సపర్యలు చేసి అనంతరం ఆసుపత్రికి తరలించారు.


కైకలూరులో బైక్‌పై వెంబడి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, తదితరులు


నూజివీడు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



కలిదిండిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, యార్డు సిబ్బంది

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

» కైకలూరులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కైకలూరు,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కైకలూరులో జోరువానలో ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా రెపరెపలాడింది. వానను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో సహా నాయకులు, ప్రజలు దేశభక్తిని చాటుకునేందుకు బైక్‌పై హర్‌ఘర్ తిరంగా యాత్రను కొనసాగించారు. బుధవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నుంచి జాతీయ రహదారి వెంబడి మార్కెట్‌యార్డ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని బుల్లెట్ నడుపుతూ మధ్యమధ్యలో బైక్‌పై నిలబడి మిగిలిన వారిని ఉత్సాహపరుస్తూ ర్యాలీ చేశారు. తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

● మండవల్లి: మండవల్లిలో పంచాయతీ రాజ్ డీఈఈ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఈలు శ్రీనివాసరావు, కమలరాజ్, నియోజకవర్గ పరిధిలోని ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

● కలిదిండి : కలిదిండి మార్కెట్ యార్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు టీడీపీ నాయకులు, విద్యార్థులు మార్కెట్ యార్డు సిబ్బంది బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, యార్డు కార్యదర్శి ప్రసాద్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లి పూడి నాగరాణి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు త్రిపుర జూనియర్ కళాశాల శారద, వాగ్దేవి కళాశాలల విద్యార్థులు మువ్వన్నెల జెండాలు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. నూజివీడు ఏఎంసీ వైస్‌చైర్మన్ కుంపటి అరుణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోను అప్పారావు, కోశాధికారి మాటూరి రవికాంత్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, సీనియర్ నాయకులు గొనేటి శ్రీనివాసకుమార్, బీజేపీ కార్యకర్తలు దోనెపాటి మల్లికార్జునరావు, దద్దనాల రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చనుబండలో తిరంగా ర్యాలీ

చాట్రాయి:చనుబండ గ్రామంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తామని బీజేపీ నాయకుడు బుర్రి శ్రీకర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, రాజకీయ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు : కామినేని

కైకలూరు,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో మాట్లాడి పంద టన్నుల యూరియా కైకలూరు నియోజకవర్గానికి వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు గ్రామాల్లో పీఏసీఎస్‌ల ద్వారా వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలో రైతులకు యూరియాను సరఫరా చేయాలని ఆదేశించారు. కైకలూరు, మండవల్లి వ్యవసాయశాఖ ఏడీలు ఎ.పార్వతి, జె.వెంకటలక్ష్మి, ఏవోలు ఆర్. దివ్య, బి. వేణుమాధవ్, జె.శ్రీనివాసరావు, కె.విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న కైకలూరు సీఐ, మండవల్లి ఎస్ఐ

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

మండవల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవించడంతో పాటు పెద్ద ఎత్తున యువతకు అమ్ముతున్న ఇద్దరు యువకులను మండవల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండవల్లి పోలీస్ స్టేషన్‌లో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు బుధవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కైకలూరు వెలమపేటకు చెందిన షేక్ వరీద అహ్మద్, ముదినేపల్లి మండలం దేవపూడికి చెందిన ఎలిసే రాజేష్ కొంతకాలంగా గంజాయికి బానిసలుగా మారారు. ఒడిశా వైల్వేస్టేషన్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు సమాచారం అందుకున్న బుధవారం చావలిపాడు వద్ద ఇరువురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి 755 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ట్రైనింగ్ ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు తప్పవు'

కైకలూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వాసు హెచ్చరించారు. బుధవారం కైకలూరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. 43బృందాలుగా ఏర్పడి 3,009 విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారు. వాటిలో 525 సర్వీసులు విద్యుత్ శాఖ నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించి రూ. 11,40,000 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అనంతరం కైకలూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్టు ప్రజలు గుర్తిస్తే స్వచ్ఛందంగా ఆ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. సెల్ 9440812091 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో గుడివాడ ఈఈ జేబీ శ్రీనివాసరావు, కైకలూరు డీఈఈ బీరమయ్య, ఏఈలు కె.శ్రీనివాసమూర్తి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


పెళ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేస్తున్న డైరెక్టర్

పెళ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తుమ్మగూడెం పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న రైతు కుమారుడు శివ నారాయణ వివాహం సందర్భంగా రూ.20 వేలు విలువైన బంగారు నాణెన్ని బుధవారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద బంగారు నాణెం అందజేశారు. క్లస్టర్ మేనేజర్ వివేకుమార్, సంఘం అధ్యక్షురాలు మండలపు పద్మావతి, మాజీ సర్పంచ్ మాదల నరసింహారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ అందజేత

మర్లబండం పాల సహకార సంఘం సభ్యులకు బుధవారం అధ్యక్షుడు ఆర్.చెన్నారావు రూ.95,600 బోనస్ పంపిణీ చేశారు. 2025-26 సంవత్సరం మొదటి విడత బోనస్ పంపిణీ చేశామని చెప్పారు. వేతన కార్యదర్శి ఎస్.ఏసు పాడి రైతులు పాల్గొన్నారు.


చింతలపల్లిలో త్రిసభ్య కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

చింతలపల్లి సొసైటీ చైర్మన్ రమేష్‌బాబు ప్రమాణ స్వీకారం

ముసునూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): చింతలపల్లి కో-ఆపరేటివ్ సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా అక్కిరెడ్డిగూడెంకు చెందిన జనసేన నాయకులు బర్మా రమేష్‌బాబు, సభ్యులుగా జోసుబోయిన రంగారావు, పల్లిపాము పెంటమ్మలను కార్యదర్శి ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్ర, బర్మా శ్రీనివాసరావు, నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, మానురాజు సురేష్, పాలడుగు ప్రశాంత్, పులిజిల్లి సత్యనారాయణ, బర్మా శేషగిరిరావు, పాశం నాగబాబు, సొసైటీ సిబ్బంది సన్మానించారు. రైతులకు ఉత్తమ సేవలు అందించడంతోపాటు సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు.

● నూజివీడు టౌన్ : నరసింగపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా పొన్నం వెంకట రామచంద్రరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా వెంకట రామచంద్రరావు సభ్యులుగా మాదాల రవి, పొన్నంపల్లి ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిలుగా ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, ముఖ్యపల్లి సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆగిరిపల్లి టీడీపీ మండలాధ్యక్షులు నక్కనబోయిన వేణుగోపాల్, బీజేపీ నాయకులు గొనేటి శ్రీనివాస్ కుమార్, టీడీపీ ఆగిరిపల్లి పట్టణ అధ్యక్షులు పాముర్తి నరసింహారావు, పొన్నం రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

● చాట్రాయి : చాట్రాయి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా తుమ్మల రామ్మోహనరావు(జనసేన), సభ్యులుగా కాలసాని సత్యనారాయణ, దివ్వెల జయరాజు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి పాల్గొన్నారు. పీఏసీఎస్ కార్యదర్శి శ్రీనివాసరావు, కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, ఇజ్జగాని వెంకటేశ్వరరావు, యద్దా ప్రసాద్, తుమ్మల జగన్, ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం'


కొత్తగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీహరి

చాట్రాయి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని ఏలూరు జడ్పీ సీఈవో శ్రీహరి అన్నారు. బుధవారం కొత్తగూడెం గ్రామంలో తడి పొడి చెత్త సేకరణను ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ కేవలం 30శాతమే జరుగుతున్నట్లు తెలిసి పద్దానని అందుకు గల కారణాలు ఏమిటని సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎంపీఎస్ నాగరాజులను ప్రశ్నించారు. గ్రామానికి యర్రావారిగూడెం, పాతకూరు శివారు పల్లెలుగా ఉన్నాయని, పంచాయతీకి ఆదాయం తక్కువగా ఉండడం, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో నిధుల కొరత ఉందని వివరించారు. దీనిపై సీఈవో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతాయని, ఇంకా ఒక చెత్త సేకరణ వాహనాన్ని కొనుగోలు చేసి తడి పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి వానపాముల ఎరువు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం సీఈవో ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్త సేకరణపై మహిళలకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీ4 సర్వే పూర్తిచేయాలి..

ముసునూరు : పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 సర్వేను సూరుశాతం పూర్తిచేయాలని జిల్లా జడ్పీ సీఈవో ఎస్.శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మండల కార్యాలయంలో పీ4 సర్వేపై ఎంపీడీవో బీపీ సత్యనారాయణ, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పీ4 సర్వే 90 శాతం మాత్రమే అయిందని మిగిలిన 10 శాతం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ సగ్గుర్తి శ్రీనివాసరావు, ఏవో భోగిపల్లి ఛాయాకుమారి పాల్గొన్నారు.

పెయ్యేరు పంచాయతీపై మధ్యలోనే ముగిసిన విచారణ

» పదేళ్ల అంశాలపై విచారణ సాధ్యం కాదన్న విచారణాధికారి


విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో లక్ష్మి, సిబ్బంది

ముదినేపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పెయ్యేరు పంచాయతీలో పరిపాలనాపరమైన అంశాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలపై బుధవారం పంచాయతీ శాఖ అధికారులు చేపట్టిన విచారణ మధ్యలోనే నిలిచిపోయింది. ఈ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం, రికార్డుల నిర్వహణలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన దూలా చంద్రకాంత్ ఇటీవల జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసిన ఫిర్యాదుపై విచారణ జరపాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు విచారణాధికారిగా డీఎల్‌పీవో లక్ష్మిని నియమించారు. బుధవారం పెయ్యేరు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టి సర్పంచ్ అల్లు సుశీల, అప్పటి పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌ను పలు అంశాలపై విచారించి వివరాలు తెలుసుకున్నారు. పిటిషన్‌దారుడు చంద్రకాంత్ తన వాదనను వినిపిస్తూ గత పదేళ్లుగా పంచాయతీలో ఎన్నో అవకతవకలు జరిగినట్టు పేర్కొన్నారని తెలిపారు. పంచాయతీకి సంబంధించిన పలు అంశాల విచారణ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని ఈ సందర్భంగా కార్యదర్శి శ్యామ్ సుందర్ చెప్పగా, పిటిషన్‌దారు చంద్రకాంత్ మాట్లాడుతూ 2023లో కోర్టులో వేరే వ్యక్తి పంచాయతీపై దావా వేశారని, పిటిషన్‌తో తన ఫిర్యాదుకు ముడిపెట్టవద్దని తెలిపారు. వాదప్రతివాదనల మధ్య విచారణాధికారి విచారణను ముగించారు. పిటిషన్‌దారు కోరుతున్న విధంగా పదేళ్ల నుంచి పంచాయతీ వ్యవహారాలపై విచారణ నిర్వహించడం పెద్ద ప్రక్రియ అని కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాల స్థితిపై ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాల ప్రకారం విచారణ నిర్వహిస్తామని ఎంపీ ప్రకటించి వెళ్లిపోయారు. ఈమేరకు విచారణ మధ్యలోనే ముగిసినట్లయింది. ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో అశోక్ పాల్గొన్నారు. ఈమేరకు దూలా చంద్రకాంత్ మాట్లాడుతూ తాను మరోసారి కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని, పూర్తిస్థాయి విచారణ చేయాలని కోరతానన్నారు.


షేక్ జ్యోతికి పర్సును అందజేస్తున్న సీఐ కృష్ణ, ఎస్ఐ శ్రీను

మహిళకు పోగొట్టుకున్న పర్సు అందజేత

కైకలూరు,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆటోలో పర్సు పోగొట్టుకున్న మహిళకు కొన్ని గంటల్లోనే పోలీసులు తిరిగి అప్పగించిన ఘటన కైకలూరులో జరిగింది. కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. భుజబలపట్నం గ్రామానికి చెందిన షేక్ జ్యోతి మంగళవారం రాత్రి పది గంటల సమయంలో కైకలూరు వెంకటరమణ థియేటర్ ఎదుట ఆటో దిగింది. ఆ సమయంలో పర్సు ఆటోలో మరిచిపోయింది. అనంతరం కైకలూరు టౌన్ పోలీసులను ఆశ్రయించి పర్సులో రూ.13వేలు నగదు, డెబిట్‌కార్డు, పాన్‌కార్డు, తదితర విలువైన పత్రాలు ఉన్నాయని చెప్పింది. సీఐ కృష్ణ ఎస్ఐ ఆర్.శ్రీను ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. వీరితో పాటు కానిస్టేబుల్ కె.నాగార్జున సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి ఆటోను గుర్తించారు. ఆటోను అదుపులోకి తీసుకుని పర్సును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆమెకు పర్సును అందజేశారు.

లీజు సొమ్ములు సమానంగా పంచాలని ధర్నా

ఏలూరు రూరల్, ఆగస్టు 13, (ఆంధ్రజ్యోతి): గత 40 ఏళ్ల నుంచి కొనసాగుతున్న వేదంగాని భూముల లీజు సొమ్ము వాటాలు అన్ని కుటుంబాలు సమానంగా పంచుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన దళితులు ధర్నా నిర్వహించారు. బుధవారం దళిత మహిళా రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, జేసీ ధాత్రిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉనికిలి గ్రామంలో మాల, మాదిగ, మాలదాసు సామాజిక వర్గానికి చెందిన వారు పీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులుగా ఉన్నందున 150 ఎకరాల భూమి కేటాయించి, అందులో జిరాయితీ పట్టా తప్పుడు బి పట్టాలను 69 ఎకరాలకు మాత్రమే మనిషికి ఎకరం చొప్పున ఇచ్చారని, ఆనాటి నుంచి నేటి వరకు 330 మంది కుటుంబాలు దానిపై వచ్చే ఫలసాయం సమానంగా అనుభవిస్తున్నారన్నారు. కొంత కాలం క్రితం వేరే గ్రామానికి చెందిన వ్యక్తులు ఈ సొసైటీలో 76.14 ఎకరాలు నకిలీ పట్టాలు సృష్టించి మా సొసైటీ భూమిని కాజేయాలని ప్రయత్నించారని, కానీ ప్రభుత్వ అధికారులు విచారణ చేసి ఆ నకిలీ పట్టాలను రద్దు చేశారని తెలిపారు. ఇప్పుడు ఆ నకిలీ పట్టాదారులు మా సొసైటీ పట్టాదారులను ఎవరి ఎకరం లీజు వారే తీసుకోవాలని, అందరికీ పంచవద్దని చెప్పి రెచ్చగొడుతున్నారని తెలిపారు. వారి మాటలు నమ్మి కొంత మంది కూడా సొసైటీ పట్టాదారులకు అందరికీ లీజు పంచే దేంటి అంటున్నారని, దీనితో సొసైటీయే జీవనాధారమని, అన్ని కుటుంబాలకు లీజు సొమ్ములు సమానంగా పంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు కె.రాజబాబు, గునిపూడి యోహాను, వి. యోసేపు, కె.సురేష్ పాల్గొన్నారు.

బ్యాంకుల్లో పంట రుణాలు ఇవ్వాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కౌలు గుర్తింపు ఉన్న రైతులకు పంట రుణాలు బ్యాంకుల్లో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రికి ఏపీ కౌలు రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఈ మేరకు ఏలూరులో వినతిపత్రం సమర్పించారు. ఏపీ కౌలు రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ నాయకత్వంలో సంఘ నాయకులు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను కలిశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇచ్చేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

కుండపోత

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో, టోల్‌ఫ్రీ నెంబరు 1912కు గాని, కంట్రోల్ రూమ్‌లకు గాని తెలపాలన్నారు.

పోలీస్‌శాఖ అప్రమత్తం


ఏలూరు క్రైం: వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర విప త్తుల నిర్వహణ శాఖ వాతావరణ హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఎక్కడైనా వాగు లు, వంకలు, కాలువలు దాటే సమయంలో ప్రజలు జాగ్ర త్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా రాత్రి వేళల్లో ముమ్మరం చేశారు. ఎక్కడైనా చెట్లు కొమ్మలు పడిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చెట్లను తొలగించ డానికి కట్టర్స్ పని వాళ్లను సిద్ధం చేశారు. ఎక్కడైనా ఏదైనా ప్రమాద సంఘటన ఉంటే వెంటనే 112కు సమాచారం అందించాలని ఆ ప్రకటనలో పోలీసులు సూచిస్తున్నారు.

ఇంకెప్పుడు ?

(5వ పేజీ తరువాయి)

స్థానం రాబోతుందా అని ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం కావడంతో వీరిద్దరే కాకుండా మరికొందరు సీనియర్ నేతలు పార్టీ తమను కూడా గుర్తించి అవకాశం ఇస్తుందని భావించారు. వీరికి తోడు అధికార ప్రతినిధి శ్యామచంద్ర శేషు డీర్ఘకాలికంగా ఇలాంటి ఆశతోనే ఉన్నారు. పార్టీలో నారా లోకేశ్ ఆశీస్సులున్న శేషుకి త్వరలోనే ఏదైనా కార్పొరేషన్‌లో చోటు దక్కుతుందని భావిస్తున్నారు. తాజాగా దెందులూరు నియోజకవర్గానికి చెందిన మంతెనాల లక్ష్మికి ఏపీ వడ్డె అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. కొల్లేరు వాసుల్లో అత్యధికులు ఈ సామాజిక వర్గానికి చెందిన వారే. దీనిని దృష్టిలో పెట్టుకుని జనసేన పక్షాన ఐంతకుముందు దెందులూరు నుంచి పోటీ చేయాలని లక్ష్మి భావించారు. అప్పట్లో అది సాధ్యం కాలేదు కాబట్టి ఇప్పుడు కార్పొరేషన్‌లో కీలక పదవిని ఆమెకు అప్పగించినట్లైంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(కి.లో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నేక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ ఫోమ్ రైతు ధర రూ.475	

ఏకధాటిగా వర్షం

ముసునూరు/కలిదిండి/ముదినేపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో ముసునూరు మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం నుంచి ఒక మోస్తరు వరం ఏకధాటిగా కురిసింది. భారీ వర్షాలు కురిస్తే చెరువులు నిండి, ఖరీఫ్ వ్యవసాయానికి ఇబ్బంది ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నీటి ఎద్దడి ఏర్పడడంతో పంట పొలాలు ఎండిపోతున్న దశలో వర్షాలు కురుస్తుండడంతో వరి పైరు ఊపిరిపోసుకున్నాయి. వేసవి చెరువుల్లో నీటి మట్టాలు తగ్గడంతో ఆక్వా రైతులు సాగు నీరు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలోని వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. జిల్లాలో అత్యధికంగా ఈ మండలంలో 11.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. డ్రైనేజీ లేకుండా కురిసిన వర్షాల కు ముదినేపల్లి, చినపాలపర్రు, పెదపాలపర్రు గ్రామాల్లో వెద జల్లిన నాట్లు వేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. పెదపాలపర్రులో 200 ఎకరాలు ముంపు బారినపడ్డాయి. ముదినేపల్లిలో ముంపు నుంచి వరిపైరు తేరుకునే పరిస్థితి కనిపించడం లేదని రైతు చింతపల్లి అశోక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.